ప్రజాశక్తి

సోమవారం 5 ఆగష్టు 2024 | 8 పేజీలు

ప్రకాశం | బాపట్ల







మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

సైన్స్ పట్ల అవగాహనతో

మానవాళికి ఉపయోగపడే ఆవిష్కరణలు

- సమాజంలో అభివృద్ధి నిరోధకాలుగా మూఢనమ్మకాలు
- జనవిజ్ఞానవేదిక జిల్లా ప్లీనరీలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

సమాజంలో మూఢనమ్మకాలను పారదోలి సైన్స్ పట్ల అవగాహన పెంపొందించడం ద్వారా మానవాళికి ఉపయోగపడే ఎన్నెన్నో నూతన ఆవిష్కరణలను సాధించవచ్చని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. జనవిజ్ఞానవేదిక బాపట్ల జిల్లా 18వ ప్లీనరీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక గుల్లాపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జనవిజ్ఞానవేదిక ప్రధాన కార్యదర్శి కుంచా వెంకటరామ్మోహన్‌రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలు అనేవి అభివద్ధి నిరోధకాలుగా మారాయని, సైన్స్ పట్ల ప్రజలలో మరియు విద్యార్థులలో అవగాహన కల్పించడం ద్వారా సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలను ప్రపంచానికి అందించవచ్చని అన్నారు. సమాజంలో మూఢనమ్మ కాలను పారదోలి టెక్నాలజీ ద్వారా మానవాళికి జరుగుతున్న మేలును అందరికీ వివరించ గలరని అన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ జనవిజ్ఞానవేదిక చేస్తున్న సేవలు, మూఢనమ్మకాలను తరిమికొట్టే విధంగా ప్రజలకు కల్పిస్తున్న అవగాహనను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.కవిత, కాటూరి లక్ష్మీనారాయణ, ఐ.రంగారావు, తంగా శ్రీనివాసరావు, మచ్చ వెంకటేశ్వర రెడ్డి, హబీబ్, ఆర్.హరిప్రియ పాల్గొన్నారు. కార్యక్రమానికి కాటూరు నాగేశ్వరరావు, బాదావత్ సాంబయ్య నాయక్ నేతృత్వం నిర్వహించారు.

నిండుతున్న సాగర్ రిజర్వాయర్

- ఏడాది మాగాణికి నీటి కష్టాలు తీరినట్లే..
- నీటి విడుదలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమే కీలకం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కృష్ణానదికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దాని పరిధిలో ఉన్న అన్ని రిజర్వాయర్లు నీటితో కళకళలాడుతున్నాయి. శ్రీశైలం నిండింది. దాని గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఈ ఏడాది సాగునీటి కష్టాలు తీరినట్లేనని రైతులు భావిస్తున్నారు. శ్రీశైలం నుంచి 5.40 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నిండుతోంది. ఇదే తీరున ఎగువ నుంచి వరద నీరు వస్తుంటే.. నాలుగైదు రోజుల్లోనే సాగర్ జలాశయం నిండే అవకాశాలున్నాయి.

సాగర్ జలాశయం నీటి మట్టం 590 అడుగులు కాగా ఇప్పటికే 570లకు పైగానే నీరు చేరింది. ఇక్కడ నిండితే పులిచింతలకు నీటిని విడుదల చేస్తారు. కృష్ణానదికి భారీగానే వరద నీరు వస్తోంది. ఆల్మట్టి, నారాయణ్‌పూర్, జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి రోజుకు 4 లక్షల క్యూసెక్కులకు పైగానే నీరు శ్రీశైలం డ్యాంకు వస్తోంది. ఇది కూడా నిండిపోవడంతో సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. సిఎం చంద్రబాబు కూడా శ్రీశైలం డ్యాంను సందర్శించారు. కృష్ణానదిపై ఉన్న అన్ని రిజర్వాయర్లు నిండటంతో ఈ ఏడాది సాగునీటి కష్టాలు తీరినట్లేనని భావిస్తున్నారు. సీజన్ వచ్చేసరికి ఒక్కసారిగా వరదలు రావడంతో అన్నీ నిండిపోయాయి. రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రెండేళ్లుగా సాగర్‌లో నీళ్ల లేక మాగాణికి నీరివ్వలేదు. తాగునీటికి తప్ప ఆరుతడి పంటలకు కూడా నీళ్ల లేవు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాగునీరు లేనందున మాగాణి ప్రాంతంలో పంటలూ సరిగా పండలేదు. వర్షాధారిత పంటలు వేసినందున రైతులు నష్టపోయారు. పైగా గతేడాది కరువు వెంటాడింది. రబీలో వేసిన పంటలు ఏమీ రైతులకు దక్కలేదు. ఖరీఫ్‌లోనూ అదే పరిస్థితి. ఎన్నికల రావడంతో యంత్రాంగం మొత్తం రైతులపై దృష్టి సారించలేదు. ఇటీవలే కేంద్ర బృందాలు జిల్లాల్లో పర్యటించి వెళ్లాయి. కరువుపై సాయం ఏమిటనేది కేంద్రం ఇప్పటికీ ప్రకటించలేదు. ఈ ఏడాది వర్షాలు కొంత ఆశాజనకంగానే ఉన్నాయి. దీనికి తోడు కృష్ణానదిపై ఉన్న అన్ని రిజర్వాయర్లు నిండటంతో సాగునీటికి ఇబ్బందులు తొలగాయి.రెండేళ్ల తర్వాత మళ్ళీ రైతులు మాగాణి సాగుకు సిద్ధమవుతున్నారు. కుడి కాలువ పరిధిలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో ఆయకట్టు ఉంది. ఇందులో 1.90 లక్షల ఎకరాలు మాగాణి ఉండగా మిగతా విస్తీర్ణం ఆరుతడి పంటలు వేస్తారు. ప్రస్తుతం కుడికాలువకు నీటిని విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తి కోసం 5 వేల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేస్తున్నారు. కుడికాలువ పరిధిలోని బుగ్గవాగుకు 5,190 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అక్కడ నుంచీ కుడికాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం కాలువలకు వచ్చే నీటితో చెరువులు నింపుకుంటే మంచిది. తాగునీటి చెరువుల్లోనూ నీరు తక్కువగా ఉంది. ఇప్పుడు పంటలకు పెద్దగా అవసరం లేనందున చెరువులకు నింపే యత్నం చేయాల్సి ఉంది. వచ్చే నీటిని సద్వినియోగం చేసుకునేందుకు ఇరిగేషన్, పంచాయతీరాజ్, తాగునీటి విభాగాలు ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. పాలకపక్ష ప్రజాప్రతినిధులు కూడా సాగునీటిపై దృష్టి సారించాలి.

ప్రమోషన్లలోనూ చేతివాటం.!

- అర్హత లేని వారికీ అవకాశం.!
- మార్కాపురం విద్యుత్ శాఖలో పరిస్థితి..



ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం విద్యుత్ శాఖలో అక్రమాలకు కొదవ లేదు.. చేయాల్సిన పనుల్లోనే కాదు.. ఉద్యోగోన్నతుల్లోనూ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. అర్హత కలిగిన వారిని కాదని.. అనర్హులకు ఉద్యోగోన్నతులు కల్పించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ శాఖలో డివిజన్ స్థాయి ముఖ్య అధికారి ఇలాంటి అక్రమాలకు ఆద్యుడిగా నిలిచారు.!

విద్యుత్ శాఖ మార్కాపురం డివిజన్ కార్యాలయ పరిధిలో ఉద్యోగోన్నతికి సంబంధించి మూడు పోస్టులు ఉన్నాయి. అసిస్టెంట్ లైన్‌మెన్ నుండి లైన్‌మెన్‌గా పదోన్నతి కల్పించాల్సిన పోస్టులు అవి. ఖాళీ అయిన లైన్‌మెన్ పోస్టుల్లో సీనియారిటీ ప్రకారం అసిస్టెంట్ లైన్‌మెన్‌లకు.. లైన్‌మెన్‌లుగా అవకాశం కల్పించే వీలుంది. ఇందులో పనిష్మెంట్‌కు గురైన వారికి ముందుగా అవకాశం కల్పించకూడదనే నిబంధన కూడా ఉంది. ఈ ఉద్యోగోన్నతుల కల్పనకూ ఓ కమిటీ ఉంది. డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (డిపిసి) నిర్ణయం అవసరం. ఈ కమిటీకి చైర్మన్‌గా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా పి.ఓ, సి.ఓ, జె.ఎఓలు ఉంటారు. ఉద్యోగోన్నతుల కల్పనలో అర్హత కలిగిన వారిలో శాఖపరంగా ఎలాంటి మచ్చ లేని వారికి... అందులో కూడా సీనియారిటీని తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. కమిటీలో చర్చించకుండా అంతిమ నిర్ణయం తనదేనని చైర్మన్ హోదాలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారి కపక్షంగా చేతివాటంతో పాటు తనకు అనుకూలమైన వారికి అందలం కల్పించేలా వ్యవహరించారు. అర్హత కలిగిన వారిని కాదని... అర్హత లేని వ్యక్తి ఉద్యోగోన్నతి కల్పించి విమర్శలకు కారకుడయ్యాడు.

విద్యుత్ శాఖ మార్కాపురం డివిజన్ కార్యాలయ పరిధిలో ఉద్యోగోన్నతులకు సంబంధించిన పోస్టులు మూడు ఉండగా... ఉద్యోగోన్నతులకు అర్హత కలిగిన వారు ఐదుగురు ఉన్నారు. వారిలో ముగ్గురికి ఉద్యోగోన్నతి కల్పించడం జరిగింది. ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఒకరు పనిష్మెంట్‌కు గురైన వ్యక్తి ఉన్నారు. అర్హత ఉండీ... ఎలాంటి రిమార్క్ లేని వ్యక్తిని ఉద్యోగోన్నతికి దూరంగా ఉంచారు. ముడుపులతో నింబంధనలకు తిలోదకాలు ఇచ్చారని కీలకమైన అధికారిపై ఆరోపణలు లేకపోలేదు. ముఖ్య అధికారి వ్యవహారం తనకు అనుకూలంతో పాటు ముడుపులు ముట్టచెప్పగలిగితే చేయకూడని పనైనా చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని ఆ శాఖలో గుసగుసలు వినపడుతున్నాయి. ఉద్యోగోన్నతుల కల్పనపై ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపడితో లోగుట్టు కాస్తా... రట్టు కానుంది.!

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన.. ఆ చట్టాలను నిలిపేయాలి

పోలీసుల ఆరోగ్య సంక్షేమమే ధ్యేయం: ఎస్పీ

గిరిజన విద్యార్థులతో వంట పనులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో విద్యార్థులతో ఆదివారం వంట పనులు చేయించారు. ఆ పాఠశాలలో 600 మంది దాకా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా ప్రతి వారం ఏదో ఒక తరగతి నుంచి ఏడు నుంచి ఎనిమిది మంది విద్యార్థులతో వంట పని చేయిస్తునట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఈ ఆదివారం మెనూలో చపాతి ఉండగా విద్యార్థులతో 600 చపాతీలను చేయిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. తమతో వంట సిబ్బంది బలవంతంగా వంట పనులు చేయిస్తున్నారని కొందరు విద్యార్థులు చెబుతుండగా తామే ఆదివారం కావడంతో వంటవారికి సాయం చేస్తున్నామని మరికొందరు అంటున్నారు. కాగా ఇలా విద్యార్థులతో వంట పనులు చేయించడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



చపాతీలు కాలుస్తున్న విద్యార్థి

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పంచాయతీ 2వ వార్డు మెంబర్ మంటీ సువార్తమ్మ, పలువురు వైసీపీ కార్యకర్తలు రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మంటీ జాకబ్, మంటీ విజయ్, కుంబా సుబ్బారావు, సవలం బ్రహ్మయ్య, కల్లూరు కోటేశ్వరరావు, పేలి హేమలత, గురాల శ్రీదేవి, దేవరపల్లి రత్నకుమారి, గురాల మహాలక్ష్మి, కల్లూరి నాగేం ద్రమ్మ, మంతి మరియమ్మ, మందపాటి రమాదేవి, గురాల ప్రసాదు, షేక్ కరిజ్మా తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమం లో టిడిపి సీనియర్ నాయకులు షేక్ సందానిబాషా, సుదర్శి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భండాగారాలు

ప్రజాశక్తి - టంగుటూరు

గ్రంథాలయాలు విజ్ఞాన భండాగారాలని గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధన రాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆది వారం 'చదవటం నాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. బాల, బాలికలందరూ నూతన పుస్తకాలు చదవటం వలన కొత్త విషయాలు తెలుసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపి భవిష్యత్‌కు ఉజ్వల పునాదికి నాంది పలకాలని గ్రంథపాలకుడు కోరారు.

సుప్రీంకోర్టు తీర్పుతో హర్షం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగ వర్గానికి ప్రాధాన్యం ఏర్పడిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గర్నెపూడి వినయ్ మాదిగ అన్నారు. ఆదివారం యర్రగొండపాలెంలోని మంద కృష్ణమాదిగ ఆరోగ్యంగా ఉండాలని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితమే ఈ తీర్పు అన్నారు. అనంతరం స్వీట్లు పంచారు.

ఘనంగా పోలేరమ్మ ఉత్సవం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని ఐనముక్కల గ్రామంలో వెంచేసి ఉన్న పోలే రమ్మ, అంకాలమ్మ ఉత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బండ్లు కట్టి గ్రామంలో ఊరేగించారు. వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు చేశారు.

కాలబైరవ స్వామికి పూజలు

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటలోని కాల భైరవ స్వామి దేవాలయంలో ఆదివారం ఆషాడ అమావాస్య సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న ప్రసాదాలను ఉభయ కర్తలు పాపిశెట్టి శ్రీనివాసరావు, అనూరాధ దంపతులు ఏర్పాటు చేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్, సివిల్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మెయిన్ బజార్, దోర్నాల బస్టాండ్, రీడింగ్ రూమ్ సెంటర్ తదితర ప్రాంతంలో చిరు వ్యాపారులను ఆ ప్రాంతం నుంచి తరలించారు. నిబంధనలు పాటించని పలు వాహన చోదకులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సిఐ ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాహన చోదకులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. కొందరు వ్యాపారుల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని అనేక ఫిర్యాదులు వస్తున్నాయని ఈ నేపథ్యంలో నిర్దేశించిన ప్రాంతాల్లోనే విక్రయించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వాలపై పోరాటం చేసి, ప్రజల్లో చైతన్యం నింపేందుకు ఎంపీజే ఏర్పడిందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో పట్టణ అధ్యక్షుడు షేక్ అమీర్, కార్యదర్శి పి.అయూబ్ ఖాన్ అధ్యక్షతన పట్టణ యంపీజే కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల అవసరాలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. అనంతరం మార్కాపురం పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా షేక్ నాగూర్ మీరావలి, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ మస్తాన్ వలి, షేక్ అబ్బాస్, ప్రధాన కార్యదర్శిగా పఠాన్ హబీబుల్లా ఖాన్, కోశాధికారిగా షేక్ జవాద్ అహ్మద్, మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం ఇస్లాం పేట మసీద్ ఎదురుగా ఉన్న నూతన ఎంపీజే కార్యాలయాన్ని సామాజిక వేత్త, రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి షేక్ నజీర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్‌యుండి ఖదీర్, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు షేక్ రసూల్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్.ప్రవీణ్ కుమార్, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాశిం, మార్కాపురం పట్టణ ఎంపీజే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలు


ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

మండలంలోని ఈదుమూడి ఎస్సీ కాలనీకి చెందిన 25 కుటుంబాలు జనసేనలో చేరారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెంట్యాల కోటేశ్వర రావు ఆధ్వర్యంలో జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. వారికి కండు వాలు పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ చేరినవారిలో ముంగర పవన్, కొమ్మూరి పూర్ణ చంద్ర, ఇంటూరి రాజేష్, ముంగర రాజేష్, ముంగర కార్తీక్, కొమ్మూరి ప్రసాద్, ప్రవీణ్,. కాలేబ్, ముంగర వేణు, కొమ్మూరి మురళి, ఇజ్రాయిల్, రాకేష్, ఉదయ్ కిరీన్, ప్రేమకుమార్, సంతోష్, కృపరావు, దయాకర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొట్ర అనిల్, మండల కార్యదర్శి నిడికుడి వెంకట్, మల్లెపూల శివ పాల్గొన్నారు.

ఆదివారం పాలిషింగ్ యూనిట్లు బంద్ చేయాలి

పలు పాలిషింగ్ యూనిట్లను పరిశీలించిన యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-చీమకుర్తి



పాలిషింగ్ యూనిట్లను పరిశీలిస్తున్న యూనియన్ నాయకులు

చీమకుర్తి ఏరియా గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల సంఘం నిర్ణయం మేరకు ఆదివారం యూనిట్లు బంద్ చేశారు. ఇటీవల జరిగిన యజమానుల సంఘాల సంయుక్త నిర్ణయం మేరకు ఈ ఆదివారం నుంచి బంద్ చేశారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కాట్రగడ్డ రమణయ్య, నూకల సురేంద్ర కుమార్, గౌరవాధ్యక్షులు గోగినేని నాగయ్య, జిల్లా ప్రతినిధి కందిమళ్ల గంగాధరరావు, ఎస్‌కె అహమ్మద్ బాషా, ఎస్‌కె అప్‌సాలేహాల టీము ప్రతి యూనిట్‌ను సందర్శించి యూనిట్లు ఆపేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివారం సెలవుతో ఉత్పత్తి తగ్గడంతోపాటు రేటు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి యజమాని సహకారం అందించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా ముందుకెళ్ళాలని నిర్ణయించి నట్లు తెలిపారు. దళారుల సమస్య, దొంగ బిల్లుల సమస్య తగ్గే విధంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

గౌరవనీయులైన ది ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి,చీరాల వారి కోర్టులో

ఓ.యస్ నెం.204/2022

చుక్కా రాములు ....వాది

వర్సెస్

శ్రీమతి గుద్దంటి లక్ష్మి మరియొకరు..... ప్రతివాదులు

టు

డి-1):
శ్రీమతి గుద్దంటి లక్ష్మి, భర్త గోలి కోటేశ్వరరావు, వయస్సు 49 సం.లు, హిందువు, గృహిణి, నివాసం డోర్ నెం. 8-2-1, పేరాల గొల్లపాలెం, పేరాల, చీరాల.

పై నంబరు దావాలోనూ, మధ్యంతర ఉత్తర్వుల పిటీషన్లో మీకు నోటీసు నిమిత్తం ది. 09-09-2024 నా వాయిదా అయివుంది. కావున మీరు ఆ రోజు ఉదయం గం. 10.30 ని.లకు పై కోర్టువారి ఎదుటు స్వయంగా గానీ, ప్లీడర్ గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలియపరచు కొనవలయును. లేనియెడల మీపరోక్షమున తీర్మానించ బడును.

// కోర్టు వారి వుత్తర్వుల మరియు అనుమతితో //

శ్రీమతి టి.వి. శైలజ, అడ్వకేటు,
పేరాల, చీరాల.
ఎన్ రోల్ మెంట్ నెం.ఏ.పి. **655/2013**

దావా సమను

సి.పి.సి. ఆర్డర్ 5 రూల్ 1 అండ్ 5.
మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. 319/2020

దగ్గుల వేణుగోపాల్‌రెడ్డి ...... వాది

వర్సెస్

జీలగ కోటేశ్వరరావు ...... ప్రతివాది

టు,

ప్రతివాది
జీలగ కోటేశ్వరరావు, తండ్రి: గురవయ్య
వయసు: 52 సం॥, హిందూ, వ్యాపారం,
నివాసం: పాపన్నపాలెం గ్రామం, ముడివేముల పంచాయతీ, త్రిపురాంతకం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని వాది, దావా పరిహారం నిమిత్తం అనగా, వాది వద్ద నీవు 1-3-2018వ తేదీన రూ. 80,000/- నగదు తీసుకుని బాకీపడి వాది పేర వ్రాయించి ఇచ్చిన ప్రామిసరి నోటు మీద, మీపైన పై కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేయడమైనది. ఇందు విషయమై నీకు పలు పర్యాయములు దావా సమన్లు జారీ చేయగా అవి నీకు ముట్టని కారణం చేత, ఈ దిన పత్రికలో దావా సమను ద్వారా తెలియుజేయునది ఏమనగా 23-08-2024వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో, నీవు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై నీకు ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా : **23-08-2024** — **వి.శ్రీనివాసరావు**
మార్కాపురం — అడ్వకేట్, మార్కాపురం
సెల్: **9440510490.**

నోటీసు

అండర్ ఆర్డర్ 21 రూల్ 32 సి.పి.సి.
మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి. 5/2023
ఇన్
ఓ.ఎస్. 572/2021

దేవండ్ల నాగేంద్రరావ .... డి.హెచ్.ఆర్

వర్సెస్

శింగంశెట్టి రమణ .... జె.డి.ఆర్

టు,

జె.డి.ఆర్
శింగంశెట్టి రమణ, తండ్రి: వెంకటస్వామి
వయసు: 46 సం॥, హిందూ, వ్యాపారం
నివాసం: శ్రీనివాస థియేటర్ వెనుక, సున్నంబట్టీల దగ్గర, మార్కాపురం టౌన్ ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఇ.పి.లోని డిక్రీ నందు కోర్టు వారు 19-05-2022వ తేదీన పాలించిన Permanent Injunction ఉత్తర్వును, నీవు అతిక్రమించి, ఉల్లంఘించి ఇ.పి. షెడ్యూలు ఆస్తిలోనికి అక్రమంగా నీవు ప్రవేశించుచున్నందున, నిన్ను Civil prison కు పంపమని, డిహెచ్ఆర్ పై కోర్టులో పై నెంబరు ఇ.పి. దాఖలు చేసినందున, ఇందు విషయమై నీకు పలుసార్లు నోటీసులు పంపగా వాటిని నీవు తీసుకొనకుండా తప్పించుకొను చున్నందున, ఈ దినపత్రిక నోటీసు ద్వారా నీకు తెలియ జేయునది ఏమనగా, 30-08-2024వ తేదీన ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ పై కోర్టులో హాజరై నీకు ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా: **30-08-2024**

వి.శ్రీనివాసరావు
అడ్వకేట్, మార్కాపురం

దావా సమను

ఆర్డర్ 5 రూల్ 1 అండ్ 5 సి.పి.సి
మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. నెం: 4/2024

సందిరెడ్డి రాజేశ్వరి ...... వాది

వర్సెస్

1) ముతకపల్లి రామచంద్రారెడ్డి
2) దప్పిలి సరళ .... ప్రతివాదులు

టు,

డి-1) ముతకపల్లి రామచంద్రారెడ్డి,
తండ్రి : మూర్తిరెడ్డి, వయసు: 58 సం॥,
హిందూ, ఉద్యోగి, నివాసం: కందులాపురం గ్రామం, కంభం మండలం, ప్రకాశం జిల్లా.
డి-2) దప్పిలి సరళ, భర్త: రామచంద్రారెడ్డి
వయసు: 54 సం॥, హిందూ, గృహిణి,
నివాసం : జె.సి.అగ్రహారం,
బేస్తవారిపేట మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని వాది, దావా పరిహారం అనగా దావా షెడ్యూలు ఆస్తులు భాగపంపకాలు నిమిత్తం మీ మీద, పై కోర్టులో దావా దాఖలు చేసియున్నది. ఇందు విషయమై మీకు సమన్లు పంపగా అవి మీకు ముట్టని కారణం చేత, ఈ పేపరు దావా సమను ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా 02-09-2024వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల తెలియుజేసుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా: 02-09-2024 — **ఎం.వి.రామిరెడ్డి**
మార్కాపురం — **అడ్వకేట్, మార్కాపురం.**

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అయిన గుంటూరు జిల్లా, గుంటూరు సిటిలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగర్ 3వ లైను డోర్ నెం. 4-16-447/ఎ కాపురస్తురాలు మెటికాల పుల్లారావు గారి రెండవ కుమార్తె నంబుల సుబ్బలక్ష్మి గారి నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింట్ యొక్క తండ్రి గారు అయిన మెటికాల పుల్లారావు గారు ది.23-01-1984వ తేదీన గుంటూరు అఖిలాంధ్ర శ్రీ పొట్టి శ్రీరాములు నగర్ సేవక్ సమాజం తరపున సెక్రటరీ గారు అయిన జొన్నకూటి శేషయ్య గారి కుమారుడు జొన్నకూటి రాధాకృష్ణమూర్తి గారి నుండి క్రయము పొంది వారి పేరటికి విక్రయ దస్తావేజులు వ్రాయించుకుని శ్రీ గుంటూరు జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో, 1వ పుస్తకము, 1645 వాల్యూం, 70 టు 72 పుటలలో ద.నెం. 692/1984 గా రిజిష్టరు చేయించుకొనియున్నారు. సదరు విక్రయ దస్తావేజు రీత్యా నా క్లయింట్ స్వాధీనంలో గల గుంటూరు సిటి, శ్రీ పొట్టి శ్రీరాములు నగర్, ఏరియాకు చెందిన కొరిటెపాడు గ్రామం మునిసిపల్ పాత వార్డు నెం. 1రు, కొత్త వార్డు. 2రు, బ్లాక్ నెం. 8రు, టి.ఎస్. నెం. 523 రు సరియగు కొరిటెపాడు గ్రామం తాలూకు డి.నెం. 229 రు య.10.48 సెంట్లులో ప్లాటు నెం. 302ఎ రు బాపతు చ.గ.39.1 లు ఆస్తికి సంబంధించిన దస్తావేజులున్నూ మరియు కొన్ని దుస్తులున్నూ ఒక బ్యాగులో పెట్టుకొని ది. 01-08-2024వ తేదీన మా క్లయింట్ మరియు మా క్లయింట్ యొక్క తల్లి గారు ఇరువురు గుంటూరు నుండి మార్కాపురం బస్సులో బయలుదేరి రాత్రి 9 గంటల సమయంలో మార్కాపురం చేరినారు. మార్కాపురం ఆర్.టి.సి. బస్టాండు నుండి తర్లుపాడు రోడ్డులో ఉన్న పెద్దనీళ్ల ట్యాంకు దగ్గర నివాసం ఉంటున్న మా క్లయింట్ వాళ్ల బాబాయి గారు అయిన తొలుచూరి చెన్నయ్య గారి ఇంటికి వెళ్లి తరువాత బ్యాగు గుర్తుకురాగా బ్యాగు కనిపంచలేదు. బస్సులోనే మర్చిపోవడం జరిగింది అని వెంటనే తిరిగి ఆర్.టి.సి. బస్టాండుకు వెళ్లి బస్సులో వెతకగా బ్యాగు కనిపించలేదు.

కావున పైన తెలిపిన ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింట్‌కు అందజేయవలసినదిగా మనవి చేయడమైనది. అలా చేయక సదరు దస్తావేజును ఉపయోగించి అక్రమ లబ్ధి పొందాలనే ఉద్దేశ్యంతో నా క్లయింట్‌కు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తే నా క్లయింట్ తీసుకొనే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయడమైనది.

ఇట్లు
జిఎల్ కుమార్‌రెడ్డి
అడ్వకేట్, మార్కాపురం
సెల్: **9440703240.**

ప్రజాశక్తి
సోమవారం 5 ఆగస్టు 2024

రోజురోజుకూ పెరుగుతున్న కిడ్నీ రోగులు

ఆర్వో ప్లాంట్ మూతపడటమే కారణం ● దిక్కుతోచని స్థితిలో దివాకరపల్లి

ప్రజాశక్తి-పీసీ పల్లి

దివాకరపల్లిలో కిడ్నీ రోగులు పెరిగిపోతున్నారు. గ్రామంలోని ఆర్వో ప్లాంటు మూతబడడంతో ప్రస్తుతం ఆ ఊర్లో పరిశుభ్రమైన నీరు లభించడంలేదు. దీంతో రోజురోజుకూ కిడ్నీ రోగుల సంఖ్య పెరుగుతుండడంతో దివాకరపల్లి దిక్కుతోచని స్థితిలో పడింది. గతంలో కలుషిత నీరు తాగి చాలామంది కిడ్నీ వ్యాధితో చనిపోయారు. ఈ విషయం అప్పట్లో 'ప్రజాశక్తి'లో ప్రచురితమైంది. తర్వాత అప్పటి జేవివి నాయకులు, అప్పట్లో శాసనమండలిలో పిడిఎఫ్ తరఫున ఫ్లోర్ లీడర్గా ఉన్న విఠపు బాలసుబ్రమణ్యం చొరవ తీసుకొని జనవిజ్ఞాన వేదిక, యూటిఎఫ్ సంఘాల ద్వారా గ్రామంలో సర్వే చేశారు. నీటి శాంపిల్స్ కూడా తీసి లాబ్కు పంపించారు. ఆ గ్రామంలోని నీళ్లలో విష రసాయనాలు ఉన్నాయని తేలింది. నివేదిక బయటకు వచ్చిన తర్వాత నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డిని తీసుకువచ్చి దివాకరపల్లిలో విఠపు బాలసుబ్రమణ్యం ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత శాసనమండలిలో బాలసుబ్రమణ్యం దివాకరపల్లి సమస్యపై ప్రసంగించిన తర్వాత, స్థానికంగా సిపిఎం కృషి వలన దివాకరపల్లికి సాగర్ నీటిని ఏర్పాటు చేశారు. సాగర్ నీరు తాగటం మొదలుపెట్టిన తర్వాత గ్రామంలో కిడ్నీ వ్యాధుల సంఖ్య తగ్గింది. ఒంటి నొప్పులు, కీళ్ల నొప్పులు చాలా



దివాకరపల్లిలో మూతబడ్డ ఆర్వో ప్లాంటు

వరకు తగ్గాయి. కొంతకాలం తర్వాత గ్రామానికి వచ్చే సాగర్ నీరు పైపు పగిలిపోయింది. ఆ తర్వాత దానిని పట్టించుకోలేదు. ఆ తర్వాత గ్రామంలో శీలం సుదర్శన్ సర్పంచ్గా ఉన్నప్పుడు ఆరో ప్లాంట్ను కూడా ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేశారు. అది కూడా కొంతకాలం పనిచేసి మూతబడింది. ప్రస్తుతం ఎలాంటి మంచి నీరు గ్రామస్తులకు అందుబాటు లేదు. అందువలన తిరిగి మరలా గ్రామంలో కిడ్నీ రోగులు అధికమయ్యారు. ఈ మధ్యన గత 15 రోజుల నాడు నూకతోటి చెన్నయ్య కిడ్నీ వ్యాధితో చనిపోయాడు. ప్రస్తుతం వజ్రాల చిన్నయ్య, చల్లా వెంకటేశ్వర్లు, పల్లె రక్తములు, డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరితోపాటు కోటపాటి లక్ష్మమ్మ, పోలినేని మాలకొండయ్య, చల్లా పద్మ, చల్ల నరసమ్మ, చీకల చిన్నాగయ్య, నీలం ప్రభుదాస్, కాకర్ల మాలకొండయ్య, పోలినేని వెంకట లక్ష్మమ్మ, గోచిపాతల ధనమ్మ, అద్దంకి మరియమ్మ, వీరు ఇప్పుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మందులు వాడుతున్నారు.

తాగునీటిని అందించండి: వజ్రాల చెన్నయ్య



మా గ్రామంలో 2009కి ముందు కిడ్నీ వ్యాధితో అనేక మంది వుండేవారు. అప్పట్లో ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం చొరవతో సాగరు నీరు పైపులు అందరూ ఏర్పాటు చేశారు. ఆ రోజుల్లో అందరి ఆరోగ్యాలు బాగా ఉండి ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు లేకుండా ఉన్నాయి. కొంతకాలం తర్వాత పైపులైను పగిలిపోయింది. అప్పటి నుంచి సుమారు 10 సంవత్సరాలుగా మా గ్రామానికి సాగర్ నీరు రావటం లేదు. అందువలన తిరిగి మరలా కిడ్నీ వ్యాధి అధికమైంది. నేను కూడా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం డయాలసిస్ చేయించుకుంటున్నాను. కావున అధికారులు స్పందించి మా గ్రామానికి సాగర్ నీటిని ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో పాఠశాలలో మంటలు

రూ.రెండు లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో ఆ గదిలో పుస్తకాలు, పరీక్ష పేపర్లు, నాలుగు డిజిటల్ ప్రొజెక్టర్లు, నాలుగు కంప్యూటర్లు కాలిపోయాయి. రూ.రెండు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. వాచ్మెన్ చొరవతో పెను ప్రమాదం తప్పింది. ఆ పాఠశాల వాచ్మెన్ ఖాసిం మంటలు రావడం గమనించి పాధ్యాయులకు, అగ్ని మాపక సిబ్బందికి, విద్యుత్ అధికారులకు సమాచారం చేరవేశారు. వెను వెంటనే విద్యుత్, అగ్ని మాపక సిబ్బంది, పాఠశాల పాధ్యాయులు అక్కడకు చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటికే నాలుగు డిజిటల్ ప్రొజెక్టర్లు, నాలుగు పాత కంప్యూటర్లు, గత



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

సంవత్సర విద్యార్థుల ప్రాజెక్టు నోట్బుక్స్, ప్రశ్నాపత్రాలు, ఉపాధ్యాయుల పర్సనల్ రిజిస్టర్లు కాలిపోయినట్లు ప్రధానోపాధ్యాయులు వేముల పిచ్చిరావు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎంఈవోలు పి ఆంజనేయులు, మల్లూ నాయక్ పరిశీలించారు. జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి-సంతమాగులూరు

పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం గుంటూరు- కర్నూలు రహదారిపై ఉన్న కాకానిడొంక ఆర్టీసి స్టేజి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతమాగులూరు ఎస్సీ కాలనీ యువకుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సీ కాలనీకి చెందిన జడా పెద్ద బాజీ, మందలపాటి బుజ్జి ఇరువురు బులెట్ మోటార్ సైకిల్పై నరసరావుపేట వెళుతుండగా కాకాని స్టేజి వద్ద గుంటూరు నుంచి వినుకొండ వైపు పౌడర్ లోడుతో వెలుతున్న లారీ ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ను ఢీకొంది. దీంతో బుల్లెట్ మోటార్ సైకిల్ నడుపుతున్న జడా పెద్ద బాజీ(22) తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మోటారు సైకిల్కు వెనుకాల కూర్చున్న మందలపాటి బుజ్జికి కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. బుల్లెట్ మోటార్ సైకిల్ ముందు భాగం నుజ్జు నుజ్జయింది. మృతి చెందిన జడా పెద్ద బాజీకి వివాహం కాలేదు. క్షతగాత్రుడు బుజ్జికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో సంతమాగులూరు ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలానికి నర్సరావుపేట పోలీసులు చేరుకొని లారీ డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు. మృత దేహాన్ని, క్షతగాత్రున్ని పోలీసులు నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.



మృతుడు జడా పెద్ద బాజీ

పశువుల బీడు ఆక్రమణ

ఆపై అక్రమ రిజిస్ట్రేషన్ ● వెలిగండ్ల తహశీల్దారు సువర్ణకు పాపిరెడ్డిపల్లి గ్రామ రైతుల అర్జీ

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలోని 10 ఎకరాల పశువుల బీడు భూమిని అక్రమంగా ఆక్రమించుకొని రిజిస్టర్ చేయించుకుని ఆన్లైన్ చేయించుకున్నారని గ్రామానికి చెందిన పలువురు రైతులు తహశీల్దారు సువర్ణకు శనివారం అర్జీ ఇచ్చి ఫిర్యాదు చేశారు. కంకణంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 104/5 నందు పశువుల బీడు భూమి ఉంది. ఆ భూమిలో పంచాయతీ పరిధిలోని అగ్రహారం పాపిరెడ్డిపల్లి కంకణంపాడు గ్రామాలకు చెందిన రైతులు ఆ పొలంలో పశువులను మేపు కోసం వాడుకుంటున్నారు. ఏప్రిల్ 18,2024వ తేదీన ఖాతా నెంబర్ 3014, షేక్ నాగూర్ అనే వ్యక్తి, అతని కుమారుడు, భార్య పేరు మీద 8853/2004 డాక్యుమెంట్ పుట్టించి ఆ తరువాత ఆన్లైన్ చేయించుకున్నారని పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు రాచగుండ్ల బాలయ్య, మారం పిచ్చిరెడ్డి, మేడమ్ మహేష్ రెడ్డి, మరికొందరు తహశీల్దారును కోరారు. పశువుల బీడు ఆక్రమించడంతో తమకు పశువుల మేపుకునేందుకు ఇబ్బందికరంగా ఉందని, దాన్ని పరిశీలించి పశువులబీడుగా రైతులకు ఇప్పించాలని తహశీల్దారు సువర్ణను కోరారు.



తహశీల్దార్ సువర్ణకు అర్జీ ఇస్తున్న పాపిరెడ్డిపల్లి గ్రామ రైతులు

ఆక్రమణదారుడిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-కనిగిరి

అర్బన్ కాలనీలో పేదల ఇళ్ల స్థలాలను అన్యాక్రాంతం చేస్తూ అక్రమంగా ఆక్రమించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్న గంటా ప్రశాంత్ను తక్షణమే అరెస్ట్ చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. హనుమంతునిపాడు మండలం తిమ్మారెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని మేండా రత్తమ్మ హక్కుదారులైనటువంటి 202-ఎ-14 నెంబర్ ప్లాట్ అక్రమంగా ఆక్రమించారని, ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలని కనిగిరి పోలీస్ వారికి ఫిర్యాదు చేయగా ప్రశాంత్పై కనిగిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు తెలియజేశారు. ప్రశాంత్ అనేకమంది ఇంటి స్థలాలను అక్రమంగా ఆక్రమించడం ఇతరుల స్థలాలను బినామీ కాగితాలు సృష్టించి విక్రయించడం చేస్తున్నాడని ఆరోపించారు. అంతేకాకుండా నిరుద్యోగుల దగ్గర కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లక్షలాది రూపాయలు వసూలు చేసి నిరుద్యోగులను మోసం చేశాడని వీరికి దగ్గర బంధువైనటువంటి తన సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగికి చెందిన భూమిని అమ్మి పెడతానంటూ అక్రమంగా కాజేసే ప్రయత్నం చేశారన్నారు. ఇలా అనేకమందిని మోసం చేసి సొమ్ము చేసుకున్నాడని ఆరోపించారు. ఇతనికి గత ప్రభుత్వంలో అధికార అండదండలతో పాటు అధికార యంత్రాంగం సపోర్ట్ చేయటంతోనే ఇవన్నీ జరిగాయని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. గంటా ప్రశాంత్ను అరెస్టు చేయాలని, ప్రశాంత్ బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



గాయాలపాలైన వంశీకృష్ణ, చంద్రశేఖర్రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

శ్రీశైలం నుంచి మోటారు సైకిల్పై చిలకలూరిపేట మండలం మోదుకొండవారిపాలెం గ్రామానికి చెందిన వంశీకృష్ణ, చంద్రశేఖర్రెడ్డి చిలకలూరిపేటకు బయలు దేరారు. దోర్నాల నుంచి శ్రీశైలంకు ఆర్టీసీ బస్సు వెళు తోంది. సరిగ్గా బోడేనాయక్ తండా దగ్గరకు వచ్చేసరికి అవి రెండూ ఎదురు పడ్డాయి. బస్సును తప్పించబోయి మోటారు సైకిల్తో డివైడర్ను ఢీకొట్టాడు. దీంతో వారికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. క్షతగాత్రులను దోర్నాలలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి ప్రాథమిక చికిత్సలు చేసి మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు.



పట్టుబడిన జూదరులతో పోలీసులు

జూదరుల అరెస్టు.. నగదు స్వాధీనం

ప్రజాశక్తి-పొదిలి

మర్రిపూడి మండలంలోని కెల్లంపల్లి గ్రామ శివారులో ఆదివారం పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివ బసవరాజు తెలిపారు. విశ్వసనీయ వర్గాలు అందించిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తుల్ని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.23,350 నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.



పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలంలోని పాత ముడివేముల ఊరి శివారులో పేకాట స్థావరంపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులు ఎస్ఐ సాంబశివయ్య ఆధ్వర్యంలో జరిగాయి. ఈ దాడులలో ఐదుగురు పేకాట రాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.19,510 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ప్రమాదవశాత్తు రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయ పడిన సంఘటన పామూరు రోడ్లోని భారత్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. కోవిలంపాడు గ్రామానికి చెందిన డోలా నారాయణ సిఎస్ పురం నుంచి కోవిలంపాడు వెళుతుండగా ఎదురుగా వచ్చిన మోటార్ సైకిల్ నారాయణ మోటార్ సైకిల్ను ఢీకొట్టింది. దీంతో డోలా నారాయణకు కుడికాలు విరిగిపోయింది. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది బాధితుడిని 108 వాహనంలో కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



గాయపడిన వ్యక్తి

వయనాడ్ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - రేపల్లె

కేరళ వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం విరాళాలు సేకరించారు. కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు మానవతా దృక్పధంతో ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ కోరారు. సిపిఎం, సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో దుకాణాలు, కార్మికుల పని ప్రదేశాల్లో విరాళాలు సేకరించారు. వరదల నష్టాన్ని జాతీయ విపత్తుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు కె అశ్విరాథం, కె రమేష్, జె ధర్మరాజు, డి శ్రీనివాస్, వై నవీన్, ప్రవీణ్, సిఐటియు శ్రీ వినాయక సుమో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ నాయకులు ఖాలేషా, అనిల్, రైస్ మిల్లు యూనియన్ నాయకులు మాణిక్యరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

సాంప్రదాయాలకు ప్రతీక ఎడ్ల పందేలు



ఎడ్ల పోటీలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

తెలుగు పండగల సాంప్రదాయాలకు ప్రతీక ఎడ్ల పోటీలని ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య అన్నారు. పట్టణంలోని హరిప్రసాద్ నగర్‌లో పోలు రాదా ఎడ్ల పోటీలను ఆయన ఆదివారం ప్రారంభించారు. 200కేజీల బరువు లాగుడు పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 15ఎడ్ల జతల ఎద్దులు తలపడ్డాయి. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలతో పశు సంపద ముడిపడి ఉందని అన్నారు. ఒంగోలు జాతి ఎద్దుల శక్తిసామర్థ్యాలు నేడు దేశం గర్వించదగ్గ స్థాయిలో ఉన్నాయని అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు అంతరించి పోకుండా ఇటువంటి పోటీలు పట్టణాల్లో నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఒంగోలు జాతి, మైసూర్ ఎద్దులతో ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తుందని అన్నారు. కనుమరుగవుతున్న సాంప్రదాయ పోటీలను నేటి తరాలకు అందించే విధంగా ప్రతి ఒక్కరు చొరవ తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సుబ్బయ్య, రాజు, రాజేష్, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

వెయ్యి మందికి ఉచితంగా వైద్యపరీక్షలు



వైద్య శిభిరం ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక జెడ్‌పి హై స్కూల్ ఆవరణలో నోవా అగ్రిటేక్, ఏలూరు చారిటబుల్ ట్రస్ట్, శంకర్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 1030 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో కంటి శాస్త్ర చికిత్స అవసరమైన వారిని గుర్తించి ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. వారిని గుంటూరు పెదకాకానిలోని శంకర్ కంటి ఆసుపత్రికి ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వాహనాల్లో తరలించి ఉచితంగా నేత్ర చికిత్సలు చేయనున్నారు. ఈ చికిత్సకు అవసరమైన వారు వైద్యశాలకు వచ్చేటప్పుడు ఆధార్ కార్డుతో పాటు, ఆరోగ్యశ్రీ కార్డు కూడా తప్పని సరిగా తీసుకరావాలని ఏలూరి క్యాంపు కార్యాలయం నిర్వాహకులు తెలిపారు. పరీక్షలకు వచ్చిన రోగులు, కార్యకర్తలకు శిబిరం నిర్వాహకులు ఉచిత భోజనం వసతి కల్పించారు. కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు నాయుడు హనుమంతురావు, టిడిపి వాణిజ్య విభాగం కార్యదర్శి పాలేరు రామకృష్ణ, తిలక్, శ్రీనివాసరావు, బోడాల శ్యామ్ ప్రసాద్, చెరుకూరి రమేష్, విరగంధం ఆంజనేయులు, బేతపూడి సురేష్, ఇండ్ల శ్రీను, మన్నే చింప్రియ, గుత్తికొండ సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సలో శిక్షణ అత్యవసరం



ప్రథమ చికిత్స శిక్షణ ఇస్తున్న డాక్టర్ రత్నశేఖర్

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సంజీవని మల్టీ స్పెషాలిటీ ఎమర్జెన్సీ కేర్ హాస్పిటల్‌లోని టీం సభ్యులకు ప్రథమ చికిత్సపై తిరుపతికి చెందిన రాష్ట్ర రిసోర్స్ పర్సన్ రత్నశేఖర్ ఒకరోజు శిక్షణ ఆదివారం నిర్వహించారు. అన్ని పరిస్థితుల్లోనూ ప్రథమ చికిత్స అందించే విధానాన్ని తెలిపారు. సిపిఆర్ ఏ విధంగా చేయాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించడమే కాకుండా అందరి చేత చేయించారు. భాగస్వామ్య పద్ధతిలో శిక్షణ ఇచ్చారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్, రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్, పిల్లల వైద్యులు డాక్టర్ వసంతం వీర రాఘవయ్య మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కార్యకర్త విధిగా ప్రథమ చికిత్స శిక్షణ పొందాలని అన్నారు. సిపిఆర్‌లో నిష్ణాతులు కావాలని, అలాంటప్పుడే సాటి మనిషి ప్రాణాలు పోకుండా అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో టెక్నీషియన్ కె సాంబశివరావు, అడుసు మల్లి ప్రభాకరరావు, సయ్యద్ కరీముల్లా, సంజీవని హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో పర్యటించిన జెసి సుబ్బారావు



కృష్ణానది తీరంలో పరిశీలిస్తున్న జెసి సుబ్బారావు

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని పెసర్లంక, తదితర గ్రామాల్లో జెసి సుబ్బారావు ఆదివారం పర్యటించారు. కృష్ణా నదికి స్వల్పంగా నీరు రావడంతో లంక గ్రామాల పరిస్థితులపై ఆర్డీఒ, తహశీల్దారుతో మాట్లాడారు. వరద పెరిగితే లంక గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. ఆయన వెంట రేపల్లె ఆర్డీఒ హేలా షారోన్, తహశీల్దారు బి వెంకటేశ్వర్లు, ఆర్ఐ శివత్రివేణి ఉన్నారు



మాజీ సర్పంచికి నివాళులర్పిస్తున్న రైతు నాయకులు

మాజీ సర్పంచి రామారావు మృతి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తడికలపూడి గ్రామానికి చెందిన కాట్రగడ్డ కోదండ రామారావు ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి రైతు సంఘం నాయకులు బిఎల్‌కె ప్రసాద్, వేములపల్లి వెంకటరామయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కోదండి రామారావు (78)కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన పోతర్లంక సౌత్ సర్పంచ్‌గా 10ఏళ్లు, తడికలపూడి సర్పంచ్‌గా రెండు పర్యాయాలు పనిచేసి ప్రజలు మన్ననలు పొందారని రైతు నాయకులు పేర్కొన్నారు. రైతు సంఘం, ప్రజా సంఘాలకు అండగా ఉండేవాడని అన్నారు. ఆయన మృతికి చింతిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కొల్లిమర్ల రామస్వామి, కొల్లి గోపాలరావు, బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.



బదిరుల పాఠశాలకు వాటర్ కూలర్ బహుకరిస్తున్న దృశ్యం

బధిర పాఠశాలకు కూలర్ బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

ఎస్ఎస్‌సి 1989 – 90 పూర్వ విద్యార్థుల సేవ స్ఫూర్తి కమిటీ మిత్రులు సింగరకొండ రోడ్డులోని చైతన్య బధిరుల పాఠశాల్లో కేక్ కట్ చేసి స్నేహితులు అందరూ కలిసి బధిర, వికలాంగ పిల్లల మధ్య స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. పాఠశాలకు రూ.26వేల విలువైన కూలింగ్ వాటర్ ఫ్రిడ్జ్, వాటర్ బబుల్ అందజేశారు. 65మంది పిల్లలకు మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలు ఏర్పాటు చేశారు. కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్ బాబు మాట్లాడుతూ 2015 నుండి ఇప్పటికి రూ.36లక్షలు విలువైన కార్యక్రమాలు చేశామని తెలిపారు. ధర్మవరపు వెంకటరావు, కొత్త శ్రీమన్నారాయణ, బాలాజీ, పురుషోత్తం, నరహరి, ఘంటసాల శ్రీను, పల్లపోతు శ్రీను, గార్లపాటి మురళి, బొడ్డపాటి మురళి, పసుమర్తి ప్రసాద్, గురుశేఖర్, చెన్నుపల్లి నాగేశ్వరరావు, సత్యనారాయణ, బెల్లం రాజేష్, సురేంద్ర, పాఠశాల చైర్మన్ పూనూరు ఆరోగ్యం పాల్గొన్నారు.



చైర్మన్ జంజనంకు ఫ్రెండ్షిప్ బ్యాండ్ కడుతున్న స్నేహితులు

'జంజనం'కు స్నేహితుల బంధనం

ప్రజాశక్తి - చీరాల

స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం వేడుకలు ఆదివారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుకు ఆయన స్నేహితులు స్నేహ బంధన బ్యాండ్ ధరింపజేశారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, ప్రసాద్, సుధాకరరావు, మురళీకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

తహశీల్దారుగా నాగరాజారావు

ప్రజాశక్తి -పంగులూరు

తహశీల్దారుగా డి నాగరాజారావును నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఎన్నికలకు ముందు జిల్లాలోని వేమూరు తహశీల్దారుగా పనిచేశారు. ఎన్నికల సమయంలో ఇక్కడ పనిచేసిన కృష్ణ ప్రసాద్ బదిలీపై నెల్లూరుకు వెళ్లారు.

నీట్ ర్యాంకు సాధించిన విద్యార్థి



ఎస్‌కె ఫిరోజ్ అహ్మద్

ప్రజాశక్తి - అద్దంకి, సంతమాగులూరు

నీట్‌లో ఎస్‌కె ఫిరోజ్ అహమ్మద్ ఆల్ ఇండియా 4655 ర్యాంక్, స్టేట్ 141, స్టేట్ ఓపెన్ క్యాటగిరిలో 67వ ర్యాంకు సాధించడం అభినందనీయమని విజయవాడ శ్రీ ఘోష లైట్స్ యాజ మాన్యం అభినందనలు తెలిపారు. విద్యార్థి తల్లి, దండ్రులతో పాటు సహచర విద్యార్థులు అహమ్మద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎపిసిపిడి సిఎల్ సబ్ ఈఆర్‌ఓగా తండ్రి అబ్దుల్ సలీం పని చేస్తుండగా కొప్పెరపాడులో ఎస్‌జిటి ఉపాధ్యాయురాలిగా తల్లి ఎస్‌కె రహణ పనిచేస్తున్నారు. మహమ్మద్‌కు నీట్‌లో మంచి ర్యాంకు సాధించడంతో బంధువులతో పాటు స్నేహితులు, కోచింగ్ ఇచ్చిన అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి మురళీకృష్ణ

విషయాలు వక్రీకరించడం సరికాదు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలులో శనివారం అమలు చేసిన 30యాక్ట్ సందర్భంగా టిడిపి నేత సాయిబాబా గృహ నిర్బంధం నుండి బయటికి వచ్చిన సమయంలో పోలీసులు అడ్డుకోగా ఆ సమయంలో ఓ కార్యకర్త క్రింద పడిన సెల్ ఫోన్ తీసుకుంటుండగా తీసిన వీడియోను కట్ చేసి దానిని వక్రీకరిస్తూ పోలీసుపై చెయ్యి చేసుకున్నట్లు ఓ దినపత్రిక వచ్చిన వార్తను రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ ఖండించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేసంలో ఆయన మాట్లాడారు. పోలీసులపై ఎలాంటి అగాయిత్యం గాని, చెయ్యి చేసుకోవటం గాని జరుగ లేదన్నారు. వార్తలు ప్రచురించే ముందు జరిగిన సంఘటనలో అధికారుల వివరణ తీసుకుని రాస్తే సమస్యలు తలెత్తవని అన్నారు. వాస్తవ రూపం ప్రతిభింబిస్తుందని అన్నారు. దీనిపై విచారణ జరిపి వక్రీకరించి ప్రచురించిన వార్త విధానంపై చర్యలు తీసుకుంటామని డిఎస్పి తెలిపారు. సమావేశంలో చుండూరు సిఐ శ్రీనివాసరావు, భట్టిప్రోలు ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జివి దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ధన్యజీవి ఉపాధ్యాయుడు జివి

ప్రజాశక్తి - బాపట్ల

ఉపాధ్యాయుడిగా, చిత్రకారుడిగా, సమాజ సేవా తత్పరుడుగా బధిరుల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు గూడంశెట్టి వెంకటేశ్వరరావు బహుముఖ సేవలు అందించారని సిఐడి డిఎస్పి గోలి లక్ష్మయ్య అన్నారు. గూడంశెట్టి వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా బాపట్ల పుస్తక ఉద్యమ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎకో హౌస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సన్మాన సభలో లక్ష్మయ్య మాట్లాడారు. చిత్ర కారునిగా సత్తా చూపి అవార్డులు సొంతం చేసుకున్నారని అన్నారు. బధిరుల పాఠశాల్లో మూగ, చెవిటి విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించడంలో ఎంతో నేర్పుగా బాధ్యతలు నిర్వర్తించారని అన్నారు. సంగీత, సాహిత్య రంగాల్లో ప్రతిభ చాటుకున్నారని అన్నారు. తెలుగు భాషపై మక్కువ అన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతలతో 'బాపట్ల భారతీయుడి'గా గుర్తింపు పొందారని అన్నారు. సభకు డాక్టర్ బి శరత్ బోస్ అధ్యక్షత వహించారు. పిసి సాయి బాబు, ఎ శివాజీ గణేషన్, మల్లికార్జున, తోట వెంకట నారాయణ, ఉమామహేశ్వరరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ డబ్ల్యూజికె మూర్తి, తిమ్మన శ్యామ్ సుందర్, భాగి కృష్ణమూర్తి, కోలా సుబ్బారావు, వాసుదేవరావు, ప్రసన్నాంజనేయులు, పద్మజ, నందిరాజు విజయ కుమార్, కరణం రవీంద్రబాబు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

చీమకుర్తి - ప్రజాశక్తి

కేరళ వరద బాధితులకు సీపీఎం చీమకుర్తి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చీమకుర్తిలో విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, మండల నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, క్రిష్టిపాటి చిన్నపరెడ్డి, తొట్టెంపూడి రామారావు, బెజవాడ శ్రీనివాసరావు, కొల్లూరి వెంకటేశ్వర్లు, బొడ్డు ఓబులేసు, పులి ఓబుల్ రెడ్డి, అత్తులూరి నాగయ్య తదితరులు పాల్గొన్నారు. విరాళాలు అందజేసిన చీమకుర్తి పట్టణ ప్రజలకు సీపీఎం చీమకుర్తి కమిటీ కార్యదర్శి పూసపాటి వెంకటరావు ధన్యవాదాలు తెలిపారు.



చీమకుర్తిలో విరాళాలు సేకరిస్తున్న సిపియం నాయకులు


ఉప్పుగుండూరులో విరాళాలు సేకరిస్తున్న సిపియం నాయకులు

నాగులుప్పలపాడు: కేరళ బాధిత కుటుంబాలను ఆదుకొనేందుకు సోమవారం మండలంలోని ఉప్పుగుండూరు లో సిపియం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కేరళలో అనేక మంది ప్రాణాలు కోల్పోయి అపారనష్టం వాటిల్లిన నేపథ్యంలో జాతీయ విపత్తుగా ప్రకటించి వారిని ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడంలో దేశవ్యాప్తంగా సిపియం, రైతు సంఘాలు, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి కనీసం రూ.కోటి అందించాలని తీర్మానించారు. అందులో భాగంగా ఉప్పుగుండూరులో విరాళాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. తద్వారా వచ్చిన సొమ్ము కేరళ భాదితులకు అందించడం జరగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపియం మండల కార్యదర్శి టి.శ్రీకాంత్, యు.వెంకటేశ్వర్లు, జి.బసవ పున్నయ్య, అత్తంటి సురేష్, కాకాని సుబ్బారావు, ఎన్.రామారావు పాల్గొన్నారు.

మెదరమెట్ల: కేరళ వరద బాధితుల సహాయార్థం సిపిఎం పార్టీ పిలుపుమేరకు ఆదివారం మేదరమెట్ల మండల శాఖ విరాళాలను సేకరించింది. ఈ విరాళాలను వెంటనే కేరళ రాష్ట్రానికి పంపటానికి తగు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల పార్టీ కార్యదర్శి ఎం.ఆంజనేయులు, డి.జయమ్మ, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.


మేదరమెట్లలో విరాళాలు సేకరిస్తున్న సిపియం నాయకులు


పూజలు నిర్వహిస్తున్న మంత్రి స్వామి

ఆలయంలో మంత్రి స్వామి పూజలు

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలంలోని చతుకుపాడులో తిరుణాళ్ల సందర్భంగా మంత్రి స్వామి ఆదివారం గంగమ్మ, పోలేరమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. జరుగుమల్లి టీడీపీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు మంత్రికి స్వాగతం పలికారు. ఆదివారం పొంగళ్ళ సందర్భంగా గ్రామంలో పోలేరమ్మ ఆలయం వద్ద భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జరుగుమల్లి మండల పరిధిలోని కామేపల్లి అగ్రహారంలో నూతన చర్చిని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏలూరి రాంబాబు, పెదబాబు, కొండపి మాజీ ఎఎంసి చైర్మెన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, చదలవాడ బ్రహ్మేంద్రం, కొమ్మాలపాటి కృష్ణ, నలదల రామారావు, నరాల సోమయ్య పాల్గొన్నారు.

నేడు డయాలసిస్ యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

గిద్దలూరు ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల చికిత్స కోసం నూతనంగా నిర్మితమైన డయాలసిస్ యూనిట్‌ను నేడు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించనున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లే వ్యయ, ప్రయాసలు తగ్గి ఇక్కడే కిడ్నీ వ్యాధులకు చికిత్స పొందే అవకాశం ఉంది.


మొక్కలు నాటుతున్న బాలసుబ్రమణ్యం

మొక్కలు నాటి సంరక్షించాలి

పతంజలి యోగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - మద్దిపాడు

ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పతంజలి యోగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. ఆచార్య బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మల్లవరం శ్రీవారి వనంలో వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఆలయ పరిసరాలు అంతా మొక్కలు నాటి సంరక్షిస్తున్న మల్లవరం శ్రీవారి వనం కమిటీ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కావూరి వాసు, మార్నేని కృష్ణారావు, బోయపాటి రవి, ముప్పవరపు ధనలక్ష్మి, కళ్యాణ కట్ట నిర్మాణ దాతలు అడ్డాల రవణమ్మ, బోయపాటి సూర్యమ్మ, బోయపాటి లక్ష్మీ నరసమ్మ, బెజవాడ సంజీవరావు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకలలో ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఆదివారం రాత్రి నిరసనలు చేశారు. మా ఈ నిరసన గ్రామాల నుండి మండలాలకు, మండలాల నుండి జిల్లాలకు, జిల్లాల నుండి రాష్ట్రాల వరకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ యూత్ ఫోర్స్, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

మిర్చి ఫ్యాక్టరీ తొలగించాలని గ్రామస్తుల ఆందోళన

డీఎస్పీ జగదీష్ నాయక్ హామీతో విరమించిన గ్రామస్తులు

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిశపాడు మండలం మేదరమెట్లలో ఉన్న సింథైట్ మిర్చి ఫ్యాక్టరీ వద్ద ఆదివారం వందల సంఖ్యలో గ్రామస్తులు ఆందోళన చేశారు. ఫ్యాక్టరీలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఫ్యాక్టరీ ఉద్యోగులు గ్రామస్తులను అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అనంతరం నిరసన చేపట్టడానికి టెంట్లు, కుర్చీలు తెప్పించుకొని ఆ ప్రయత్నంలో ఉండగా సిఐ శివరామ కృష్ణారెడ్డి జోక్యం చేసుకొని గ్రామస్తులకు నచ్చజెప్పి ఆందోళనను నిలిపి చేశారు. ఈ ఆందోళనలో గ్రామంలోని ఎక్కువమంది మహిళలు కూడా పాల్గొనడం విశేషం. ఈ ఫ్యాక్టరీ నుండి వచ్చే కోరు వల్ల వృద్ధులు, పిల్లలతో పాటు యువకులు కూడా చాలా ఇబ్బంది పడుతున్నారని వారు ఆందోళన చేపట్టారు. కోరు రాకుండా చూస్తామని హామీ ఇచ్చి ఆదిశగా ప్రయత్నం చేయలేదని గ్రామస్థులు వాపోయారు. అనంతరం చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ గ్రామస్థులతో మాట్లాడుతూ కలెక్టర్‌తో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

విద్యుత్ సమస్యలపై ధ్వజమెత్తిన ప్రజాప్రతినిధులు

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ సమస్యలపై అధికారులను నిలదీశారు. సమస్యలు పరిష్కరించాలని కోరినప్పటికీ విద్యుత్ శాఖ ఏఇ రమేష్ బాబు ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారే కానీ పరిష్కారం కావడం లేదని విమర్శించారు. ఎంపీడీవో మహాలక్ష్మి మాట్లాడుతూ సర్పంచ్‌లందరూ తమ విధుల గురించి తెలుసుకోవాలన్నారు. అన్ని శాఖలపై సమీక్ష చేసి పట్టు సాధించాలన్నారు.

ఎంపీడీవో మహాలక్ష్మి మాట్లాడుతూ సర్పంచ్‌లందరూ తమ విధుల గురించి తెలుసుకోవాలన్నారు. అన్ని శాఖలపై సమీక్ష చేసి పట్టు సాధించాలన్నారు. తహశీల్దార్ జయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో ఇసుక దందాలపై మాకు ఫోన్లు వస్తున్నాయని, వాటిని అరికట్టేందుకు సర్పంచులకు, కార్యదర్శులకు కూడా భాద్యత ఉందన్నారు. జడ్పీటీసీ యాదల రత్నభారతి, ఎంపీపీ అంజమ్మ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా శానిటేషన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో మహాలక్ష్మి

ఆలయ నిర్మాణం పేరుతో ఇసుక దందా

ప్రజాశక్తి-మద్దిపాడు

అక్రమ ఇసుక తరలింపు వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. మద్దిపాడు మండల పరిధిలోని పాత గార్లపాడులోని గంగమ్మ తల్లి గుడి నిర్మాణం కోసమని ఓ నాయకుడు ఇసుకను డంప్ చేసి విక్రయించుకునే పనిలో ఉన్నాడు. బాపట్ల జిల్లా అద్దంకి మండలం ధేనువుకొండ నుండి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి ఆలయం వద్ద డంప్ చేశారు. అక్కడ నుండి రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండగా విషయం తెలుసుకున్న ధేనువుకొండ గ్రామానికి చెందిన కొందరు దానిని అడ్డుకోవడంతో ఇసుక దందాకు బ్రేక్ పడింది. ప్రస్తుతం ఆ ఇసుకను తరలించేందుకు సదరు నాయకుడు విశ్వ ప్రయత్నాలు మొదలు పెట్టాడని సమాచారం. అదే విధంగా మండల పరిధిలోని కొలచనకోట, అన్నంగి, కీర్తిపాడు, రాచవారిపాలెం, నందిపాడు, ఇనమనమెళ్లూరు, మద్దిపాడు గ్రామాల్లో అక్రమ ఇసుక తరలింపు దర్జాగా సాగుతోంది. ఇష్టారీతిన గుండ్లకమ్మలో పెద్ద ఎత్తున గోతులు తీసి ఇసుకను తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో ఉన్న ఇసుక రీచ్‌లకు ఎలాంటి పర్మిషన్ లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అక్రమ ఇసుక తరలింపును అధికారులు అడ్డుకుని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఆలయం వద్ద డంప్ చేసిన ఇసుక

మట్టి వినాయకుని విగ్రహాలను ప్రోత్సహించాలి

ప్రజలకు పర్యావరణ పరిరక్షణ సంస్థ పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రానున్న వినాయకచవితి సందర్భంగా ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహిస్తే.. పర్యావరణ, కాలుష్య పరిరక్షణ జరుగుతుందని పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి.వీరభద్రాచారి తెలిపారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన, రసాయన రంగులతో అలంకరించిన విగ్రహాల వైపు నేటి యువత పరుగులు తీస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముఖ్యంగా కాలుష్య నియంత్రణ మండలి బాధ్యత వహించి.. పిఒపి విగ్రహ తయారీని, వినియోగాన్ని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. నిమజ్జనం పేరుతో ధ్వని కాలుష్యం, సముద్రాలు, నదులు, చెరువులు కాలుష్యం బారినపడి జల చరాలు కనుమరుగై, భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు,యువత భక్తి పేరుతో ప్రకతికి విఘాతం కలిగించరాదని వీర భద్రాచారి విజ్ఞప్తి చేశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల ఆర్డర్‌కు 6301796606 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అసంపూర్తిగా చప్టా నిర్మాణం

పట్టించుకోని అధికారులు, పాలకులు ● వర్షం కురిస్తే రెండు గ్రామాలకు రాకపోకలు బంద్

ప్రజాశక్తి-కొనకనమిట్ల

రోడ్లు గ్రామీణ ప్రగతికి చిహ్నాలంటూ పాలకులు పేర్కొంటున్నా అవి మాటలకే పరిమితమవుతున్నాయి. చేతలకు దూరంగా ఉంటున్నాయి. ఇందుకు నిదర్శనమే మండలంలోని చింతగుంట్ల-బురదపాలెం మధ్య ముసివాగుపై చప్టా నిర్మాణం. చప్టా నిర్మాణం మొదలు పెట్టి రెండు దశాబ్దాలు పూర్తి కావస్తున్నాయి. రూ.13 లక్షల నిధులు వెచ్చించి దిమ్మెలు నిర్మించారు. పూర్తి స్థాయిలో నిధులు మంజూరు కాలేదు. దీంతో దిమ్మెల వరకు నిర్మాణం చేపట్టి నిధులు సరిపోకపోవడంతో అర్ధాంతరంగా నిలిపివేశారు. చింతగుంట్ల గ్రామ పంచాయతీలో ఉన్న బురదపాలేనికి మధ్యలో ముసివాగు దాటి వెళ్లలేక ప్రజలు నానా వెతలకు గురవుతున్నారు. ఒకటిన్నర కిలో మీటరు దూరంలో ఉన్న ఈ గ్రామానికి చేరుకునేందుకు వాగుదాటి వెళ్లలేక చుట్టూ తిరుగు ప్రయాణంతో చేరుకుంటున్నారు. చింతగుంట్ల నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో కొత్తపల్లి, ఎదుర్రాళ్లపాడు మీదుగా ట్రాక్టర్లు, ప్రభుత్వ



అసంపూర్తిగా నిలిచిపోయిన చింతగుంట్ల-బురదపాలెం చప్టా నిర్మాణం

వాహనాలు సైతం వెళ్లాల్సిన పరిస్థితి తప్పడం లేదు. పంచాయతీ కేంద్రమైన చింతగుంట్లకు అత్యవసర పనులు, చౌక ధరల దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాలన్నా వర్షాకాలంలో ముసి వాగు దాటి వెళ్లలేక అవస్థలు పడుతున్నామని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు జరిగిన గ్రామసభల్లో అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వాగు ఉధృతి పెరగడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగుదాటి వెళ్లాల్సిన పరిస్థితి తప్పడం లేదు. చప్టా నిర్మాణం పూర్తయితే చింతగుంట్ల నుంచి బురదపాలేనికి బస్సును నడిపేందుకు వీలుగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. పల్లెసీమల అభివృద్ధికి పాటుపడతామన్న పాలకుల వాగ్దానాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. అర్ధాంతరంగా నిలిచిపోయిన చప్టాను అధికారులు, పాలకులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షం వస్తే ఇబ్బందులే: రామ శ్రీహరి, బురదపాలెం

వర్షం కురిస్తే మా బాధలు వర్ణనాతీతం. కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. కొద్దిపాటి వర్షం కురిస్తే ముసిలోకి పైనుంచి నీరు చేరుతుంది. దీంతో పంచాయతీకి వెళ్లాలంటే రాకపోకలు నిలిచిపోతాయి. నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా, వివిధ పనుల నిమిత్తం పంచాయతీ కార్యాలయానికి వెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదు. వెంటనే చప్టా నిర్మాణాన్ని పూర్తి చేయాలి.



యానాదుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎస్‌టి వర్గీకరణ చేట్టాలి

యానాదుల సంక్షేమ సంఘం కార్యవర్గం తీర్మానం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఎస్‌టి వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. ఆదివారం స్థానిక గిరిజన భవన్‌లో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి అన్ని జిల్లాల నుంచి నాయకులు హాజరై యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వం ఎస్‌టి వర్గీకరణ చేపట్టి ఎస్‌టి తెగలలో అత్యంత జనాభా కలిగి అన్ని విధాలా వెనుకబడిన యానాదులకు న్యాయం చేయాలని కోరారు. యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, నామినేటెడ్ పోస్టులలో యానాదులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. టిటిడి బోర్డు మెంబర్స్‌లో యానాదులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌టిలకు సంబంధించి రద్దు చేసిన అన్ని పథకాలను వెంటనే పునరుద్ధరించాలని, ఎస్‌టి వర్గీకరణకు సంబంధించి అన్ని సంఘాలతో సంప్రదించి త్వరలో కార్యాచరణ ప్రకటించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య, ప్రధాన కార్యదర్శి ఎందేటి వెంకట సుబ్బయ్య, రాష్ట్ర చైర్మన్ మేకల శ్రీనివాస చక్రవర్తి, ట్రెజరర్ ప్రభావతి, అధికార ప్రతినిధి బాపట్ల బ్రహ్మయ్య, ప్రకాశం జిల్లా అధ్యక్షులు కొమరగిరి మాల్యాద్రి, కార్యదర్శి పిట్టల బాస్కరరావు, యానాది ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చేవూరు సుబ్బారావు, ఉపాధ్యక్షులు చలంచర్ల పెద బ్రహ్మయ్య, రావూరి రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో చదివిస్తున్న దృశ్యం

గ్రంథాలయంలో 'చదవటం మాకిష్టం'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి పర్యవేక్షణలో ఆదివారం 'చదవటం మా కిష్టం' కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించారు. కార్యక్రమంలో మొదటగా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలతో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. తదుపరి పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో జాలాది మోహన్, మంచికంటి వెంటేశ్వరరెడ్డి, గ్రంథాలయ సిబ్బంది కె సంపూర్ణమ్మ, డి సందీప్, పి ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రమాదాల నుంచి రక్షణ

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్క హెల్మెట్ వాడి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని ఎస్ఐ ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ వాడకుండా వాహనం నడిపే ద్విచక్ర వాహనదారులపై చట్టరీత్యా కేసు నమోదు చేస్తామని అన్నారు.

బధిర విద్యార్థులకు అన్నదానం

ప్రజాశక్తి-చీమకుర్తి: స్నేహితుల దినోత్సవం సందర్భంగా చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2001-2006 పూర్వ విద్యార్థులు స్థానిక ఎస్‌కెఆర్ బధిరుల పాఠశాల విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థులు కేక్ కట్ చేసి బధిర విద్యార్థులకు స్వీట్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ అంజిరెడ్డి మాట్లాడారు.

నీటి పైపులు ధ్వంసం చేశారు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

డ్రైనేజీ కాలువ నిర్మాణం అంటూ తాగునీటి పైపులను ధ్వంసం చేశారు.. ఇప్పుడేమో తమనే బాగు చేసుకోమంటున్నారు.. ఇదెక్కడి న్యాయం అంటూ కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్బి బుజ్జి ప్రశ్నిస్తున్నారు. మైదుకూరు సింగరాయకొండ నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా మండలంలోని కోవిలంపాడు గ్రామంలో డ్రైనేజీ కాలువలు నిర్మిస్తున్నారు. డ్రైనేజీ నిర్మాణం కోసం గోతులు తీసే సమయంలో తాగునీటి సరఫరా కోసం వేసిన పైపులు ధ్వంసం అయ్యాయి. ఈ పైపులను బాగు చేయించమంటే కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని, మీరే త్వరగా బాగు చేసుకోండి లేదంటే కాంక్రీట్ వేసేస్తాం.. తర్వాత ఇబ్బంది పడతారంటూ కాంట్రాక్టర్ చెబుతున్నారని సర్పంచ్ వాపోయారు. ధ్వంసమైన పైపులైన్‌ను కాంట్రాక్టరే బాగు చేయించాలని గత నెలలో మండల పర్యటనకు వచ్చిన జెసి గోపాలకృష్ణ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. అధికారులు స్పందించి పైప్ లైన్‌లను బాగు చేయించి ఇబ్బందులు తీర్చాలని సర్పంచ్ కోరుతున్నారు. విషయంపై నేషనల్ హైవే జెఈ సుమన్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించకుండా గ్రామస్తులు రోడ్డు నిర్మాణం పనులకు ఆటంకం కలగజేస్తున్నారని, వారు తమకు సహకరిస్తే ఎవరికి ఇబ్బందులు లేకుండా అన్ని పనులు సక్రమంగా పూర్తి చేస్తామని అన్నారు.

ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను తీర్చడంలో విద్యా శాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలవారు, డిప్యుటేషన్ వేయబడిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎవరి వాదన వారు వినిపిస్తుండడంతో ఉపాధ్యాయుల కొరత తీరే దారి కనిపించడం లేదు. మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్న సంగతి విదితమే. ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు మండల విద్యా శాఖ అధికారులు ప్రయత్నం చేస్తున్నప్పటికీ సమస్య తీరే మార్గం కనిపించడం లేదు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు మండలంలోని ఇతర పాఠశాలల నుంచి డిప్యుటేషన్ వేశారు. అయితే డిప్యుటేషన్ వేయబడిన ఉపాధ్యాయుల మాతృ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండగా మరొక ఉపాధ్యాయుడిని వేరే పాఠశాలకు డిప్యుటేషన్ వేస్తే తమ పాఠశాల విద్యార్థుల పరిస్థితి ఏంటంటూ ప్రశ్నిస్తున్నారు. తమను వేరే పాఠశాలకు డిప్యుటేషన్ వేసి అక్కడ తమకు సంబంధం లేని సబ్జెక్టును బోధించమంటే తాము ఎలా బోధించాలంటూ డిప్యుటేషన్ వేయబడిన ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. సర్ ప్లస్ కాని పాఠశాలల నుంచి ఉపాధ్యాయులకు డిప్యుటేషన్ ఎలా వేస్తారని, అసంబద్ధంగా వేసిన డిప్యుటేషన్లను రద్దు చేయాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. ఉపాధ్యాయులు లేని కారణంగా పిల్లలకు సిలబస్ పూర్తి చేయలేకపోతున్నామని, ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేసి ఇబ్బందులు తీర్చాలంటూ ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వేడుకుంటున్నారు. దీంతో ఉపాధ్యాయుల కొరతను ఎలా అధిగమించాలో అర్థం కాక విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయంపై ఎంఈఓ జే ప్రసాదరావును ప్రజాశక్తి వివరణ కోరగా సమస్య పరిష్కారం కోసం డీఈవో కృషి చేస్తున్నారని జిల్లాలో ఎక్కడ ఉపాధ్యాయుల కొరత ఉన్నది, ఎక్కడ సర్ ప్లస్ ఉపాధ్యాయులు ఉన్నారు అనే దానిని గుర్తిస్తున్నారని, దీనిపై గత రెండు రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సర్ ప్లస్ ఉపాధ్యాయులను గుర్తించిన వెంటనే మండల స్థాయిలో వేసిన డిప్యుటేషన్లను రద్దు చేస్తామని, అవసరమైన ఉపాధ్యాయులను సబ్జెక్టుల వారీగా ఇతర మండలాల నుంచి డిప్యుటేషన్లు వేసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

డాక్టర్ గురుబ్రహ్మం చూపిన..

సేవా మార్గం అనుసరణీయం: డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి



మంచినీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి మున్సిపాలిటీలో మంచినీటి సరఫరా కోసం వినియోగించేందుకు కనిగిరి పట్టణానికి చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ చప్పరపు గురుబ్రహ్మం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు చప్పరపు శ్రీనివాసులు (వాసు) మంచినీటి ట్యాంకర్‌ను మున్సిపాలిటీకి అందజేయగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ గురుబ్రహ్మం వైద్యునిగా, సేవా తత్పరునిగా ఎన్నో కార్యక్రమాలను నిర్వహించి కనిగిరి ప్రజల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. ఆయన చూపిన సేవా మార్గం అనుసరణీయమని అన్నారు. డాక్టర్ గురుబ్రహ్మం సేవా మార్గాన్ని ఆయన కుటుంబ సభ్యులు చాటి కనిగిరి మున్సిపాలిటీకి మంచినీటి ట్యాంకర్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. కనిగిరి అభివృద్ధికి దాతలు సహకరించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గురుబ్రహ్మం కుమారుడు చప్పరపు శ్రీనివాసులు, కనిగిరి పట్టణ టిడిపి అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, నాయకులు వివిఆర్ మనోహర్రావు, రాచమల్ల శ్రీనివాసరెడ్డి, జి నాగిరెడ్డి, షేక్ ఫిరోజ్, తమ్మినేని సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పూర్వ విద్యార్థుల సన్మానం

ప్రజాశక్తి-వెలిగండ్ల



ఉపాధ్యాయుడు వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వెలిగండ్ల మండలం గన్నవరం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ గత నెల 31వ తేదీ ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు వెంకట రామిరెడ్డిని కనిగిరి గార్లపేట రోడ్ లోని హెూటల్ నందూస్‌లో ఆదివారం ఘన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ స్కూల్ పూర్వపు విద్యార్థి, కనిగిరి నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గతంలో విజ్ఞాన్ స్కూల్‌తోనూ, ఆయన గురువు వెంకట రామిరెడ్డితోనూ ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విజ్ఞాన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభించి ఎంతోమంది విద్యార్థులకు చక్కని బోధన అందించారని, వారంతా ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. మాకు గురువుగా కాక స్నేహితుడి లాగా ఉంటూ మార్గదర్శకంగా నిలిచాడని ఆయన అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు బంధుమిత్రులు పూర్వ విద్యార్థులు వెంకట రామిరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి, విద్యా శాఖ అధికారులు దాస్ ప్రసాద్, రామిరెడ్డి, సత్యంరెడ్డి మాజీ సర్పంచ్ సాన జైపాల్ రెడ్డి, ముక్కు పెద్దిరెడ్డి, గవదకట్ల బ్రదర్స్, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
సోమవారం 5 ఆగష్టు 2024

సంచార జాతుల్లో బడిబాట పట్టిన చిన్నారులు


బడికి వెళుతున్న విద్యార్థినిలు దార్ల లక్ష్మి, దార్ల వెన్నెల

ప్రజాశక్తి - పంగులూరు

వాళ్లు నివసించే ప్రాంతానికి ఉత్తరం వైపు విద్యా శాఖ అధికారి కార్యాలయం. తూర్పున ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్. దక్షిణాన మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. పడమర మండల పరిషత్ కార్యాలయం. వీటన్నిటి నడుమ వాళ్ళ ఇల్లు ఉన్నాయి. వాటి పక్కనే వెలుగు, తహశీల్దారు కార్యాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పంగులూరు సచివాలయం ఉన్నాయి. ఇన్ని ప్రభుత్వ కార్యాలయాల నడుమ జీవిస్తున్న ఈ ప్రజలకు మాత్రం అక్షర జ్ఞానం లేదు. లోకజ్ఞానం తెలియదు. అమాయకత్వం, మూఢ నమ్మకాలు ఏళ్ల తరబడి కష్టించి పనిచేస్తున్న వీరిలో అభివృద్ధి లేదు. కనీసం పిల్లల్ని బడికి పంపించాలన్న ఆలోచన కూడా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో 'మాకు చదువు కావాలి. మేము చదువుకుంటాం. మేము ఉద్యోగాలు చేయాలి. మేము అభివృద్ధి చెందాలి' అనే ఆకాంక్షతో ఇద్దరు బాలికలు ప్రాథమిక పాఠశాలకు వస్తున్నారు. టీచర్ చెప్పే అక్షరాలు నేర్చుకుంటున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే సౌకర్యాలు వారు అందుకుంటున్నారు. ఏమైనా చదువుకోవాలనే ఆకాంక్ష చిన్నారుల్లో కనిపిస్తుంది. ప్రస్తుతం 2వ తరగతి చదువుతున్న దార్ల లక్ష్మి, ఒకటవ తరగతి చదువుతున్న దార్ల వెన్నెల. వీరిది ఒక సంచారజాతి (బుడబుక్కల). వీరి తల్లిదండ్రులు సుమారు 40ఏళ్ల క్రితం గ్రామానికి వచ్చారు. సహజంగా ఏ గ్రామంలోనైనా 15, 20 రోజులు మించి ఉండని వీరు, పంగులూరులో 40 ఏళ్ళుగా స్థిర నివాసం ఏర్పరచుకొని జీవిస్తున్నారు. వీరిలో మగవాళ్లు పందులు మేపడం, వాటిని అమ్ముకోవడం చేస్తుంటారు. ఆడవాళ్లు గ్రామాలకు వెళ్లి ప్లాస్టిక్ సీసాలు, కాగితాలు సేకరించి వాటిని అమ్ముకొని సాయంత్రానికి ఇంటికి వస్తారు. గ్రామాల్లో జరిగే శుభకార్యాల్లో విస్తర్లు తీయటం, వంట పాత్రలు కడగటం వంటి పనులు చేస్తారు. ఇక పిల్లల విషయానికొస్తే గ్రామంలో తిరిగి చద్ది అన్నం సేకరించి పందులకు వేయటం వీళ్ళ పని. వీళ్ళలో ఎవరైనా చిన్న తప్పు చేసిన రూ.లక్షల జరిమానాలు వాళ్లకు వాళ్లే విదించుకుంటారు. ఆడ, మగ తేడా లేకుండా మద్యం సేవించి వాళ్ల శుభకార్యాల్లో కొంత సందడి చేస్తారు. సుమారు 40కుటుంబాలు ఇక్కడ జీవిస్తున్నారు. వీరికి 15మంది పిల్లలు ఉన్నారు. అయితే వీరికి ఎలాంటి చదువు, సంధ్యలు లేవు. ఎవరైనా బడికి వెళ్లొచ్చు కదా? అంటే మాకు చదువు కన్నా ఈ పనే బాగుంటదని సమాధానం చెప్పే వాళ్ళు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఎంత ప్రయత్నం చేసినా వారి మనసు చదువుల వైపు మళ్లలేదు. గతంలో కొంత మందిని పాఠశాల్లో చేర్చిన వాళ్లు చివరి కంటూ చదవలేదు. అయితే ఇప్పుడు దార్ల లక్ష్మి, దార్ల వెన్నెల మాత్రం ప్రతిరోజు పాఠశాలకు వచ్చి సాయంత్రం పాఠశాలను వదిలే వరకు బడిలోనే ఉంటారు. చదువుకుంటున్నారు. తాము కూడా మిగిలిన పిల్లలాగే చదువుకుంటామని, బాగా చదువుకొని పెద్దవాళ్లం అవుతామని లక్ష్మి, వెన్నెల చెబుతున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి మాట్లాడుతూ పిల్లలు చక్కగా బడికి వస్తారని, అందుకోసం ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన అన్ని సౌకర్యాలు వీరికీ అమలు చేస్తున్నామని చెప్పారు. వీరికి గతంలో అమ్మబడి మంజూరైందని తెలిపారు. తల్లి, దండ్రుల పోషణ, వారి సహకారం ఉంటే ఈ విద్యార్థులు బాగా చదువుకుంటారని ప్రజాశక్తికి తెలిపారు. వారిలో ఉన్న మరి కొంత మందిని తీసుకువస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. చదువుకు దూరంగా, అజ్ఞానానికి దగ్గరగా ఉంటున్న ఈ పిల్లల్లో చదువుకోవాలనే ఆకాంక్ష ఆ సామాజిక వర్గం మొత్తానికి చైతన్యం చేయాలని కోరారు. ఆ సామాజికవర్గంలో మిగిలిన పిల్లలు కూడా చదువుకొని విజ్ఞానంతో అభివృద్ధి చెందాలని కోరుకుందాం.


బుడబుక్కల వర్గీయులు నివాస ప్రాంతం


మాట్లాడుతున్న తూనుగుంట్ల సాయి బాబా

అవగాహన లేని వ్యక్తి అశోక్‌బాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత ఎన్నికలకు ఆరు నెలల క్రితం ఎక్కడి నుండో వచ్చిన వ్యక్తి అశోక్ బాబని, ఆయనకు ఇక్కడ పరిస్థితులు ఏమీ తెలియని వ్యక్తి చేసే ఎలాంటి వ్యక్తిగత వ్యాఖ్యలకైనా తాను స్పందించే పరిస్థితి లేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడి నుండో వచ్చిన వ్యక్తి ఎవరో చెప్పిన మాటలు విని తనపై అసత్య ఆరోపణలు చేయటం సరికాదన్నారు. అశోక్‌బాబు చేసిన అవినీతి చిట్టాలు తాను సిద్ధం చేశానని అన్నారు. చర్చ జరిగి ఉంటే మొత్తం ప్రజల సమక్షంలో బయటపెట్టేవాడినని అన్నారు. పోలీసులు అడ్డుకోవడం వల్ల బయట పెట్టలేకపోయానని అన్నారు. తన సతీమణి సర్పంచిగా పనిచేసిన కాలానికి సంబంధించిన ఆడిట్ రిపోర్టులు కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇకనైనా వ్యక్తిగత ఆరోపణలు చేయడం మానుకోవాలని చెప్పారు. 12వేల ఓట్లతో గెలుస్తామని ఆశపడి 25వేల ఓట్లతో ఓడిపోవడంతో మైండ్ పనిచేయక తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, జంగం సాంసన్, ఎడ్ల జయశీలరావు, కె లోకానంద్, తాండవ కృష్ణ పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లపైనే మురుగునీరు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ప్రధాన వీధుల్లో సైతం మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. గంగవరం రోడ్డు మూల మలుపు, ఇంకొల్లు – ఒంగోలు పాత మద్రాస్ రోడ్డులోని తిరుపతి వేప చెట్టు సమీపంలో రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తుంది. రోడ్డు కిరువైపులా దుకాణాలు ఉండటంతో పాటు ఇది నిత్యం వాహనాలతో ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రదేశాలు కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై మురుగు నీరు చేరటం వలన దోమలకు ఆవాసాలుగా మారాయి. రద్దీగా ఉండే ప్రాంతాలు కావటంతో పాదచారులకు సైతం రాకపోకలకు అసౌకర్యంగా ఉంటుంది. పంచాయితీ అధికారులు జోక్యం చేసుకుని మురుగు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉప్పరపాలెం రైల్వే గేటు అండర్ పాస్ నిర్మించాలి

• గేటు వద్ద నిరీక్షణ నివారించండి • మూడేళ్ల క్రితం రూ.10కోట్లతో ప్రతిపాదనలు • అమలు కానీ గత ప్రతిపాదనలు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలోని ఉప్పరపాలెం రైల్వే గేటు ఒక జీవిత కాలం లేటుగా మారింది. ఒక్కసారి గేటు పడితే 15 నుండి 30 నిమిషాల వరకు ఇక్కడ వాహనదారులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. పట్టణ జనాభాలో రెండు వంతులు జనాభా గేటు అవతల ఉంటే, మూడో వంతు జనాభా గేటు ఇవతల ఉంది. ఈ మధ్యలో ఉప్పరపాలెం వద్ద ఉన్న రైల్వేగేటును దాటాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం ఇక్కడ అండర్ పాస్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు. రూ.6నుండి రూ.10కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అయితే పనులు చేయకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. అది అమలుకు నోచుకోలేదు. తాజాగా తిరిగి అండర్ పాస్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ పర్యవేక్షణలో దీనికి సంబంధించిన ప్రణాళిక సిద్ధమవుతోంది. దాదాపు 8వార్డుల ప్రజలతో పాటు మూలపాలెం ప్రజలు పట్టణంలోకి వచ్చేందుకు దగ్గర మార్గమైన ఉప్పరపాలెం రైల్వే గేట్ ద్వారా ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. విజయవాడ – చెన్నై రైలు మార్గంలో ఉన్న(256 లెవెల్ క్రాసింగ్) రైల్వే గేటు ద్వారా రోజుకు 100కుపైగా ప్రయాణికుల రైళ్లు, మరో వంద సరుకు రవాణా గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రెండు నుండి ఐదు నిమిషాలకు ఈ గేటు వేస్తుంటారు. గేటు వేస్తే 10నుండి 15నిమిషాల వరకు గేటు తీసే పరిస్థితి ఉండదు. దీనికి తోడు ఈ మార్గంలో మూడో రైల్వే లైనుపై రైళ్ల రాకపోకలు కొనసాగిస్తుండడంతో ఒక్కొక్కసారి 30నిమిషాలకుపైగా గేటు మూసి ఉంచడంతో వాహదారులు వేచి ఉండాల్సి వస్తోంది. ఒక్కొక్కసారై నాలుగైదు రైలు వెళ్లిన తర్వాతనే గేటు తీయని పరిస్థితి చాలా సందర్భాల్లో ఎదురవుతూ వస్తోంది. ఉదయం సమయంలో ఈ మార్గంలో స్కూళ్లకు వెళ్లే వాహనాలకు మరింత ఇబ్బంది కలుగుతుంది. అత్యవసర పరిస్థితుల్లో జమ్మలపాలెంప్లై ఓవర్ ద్వారా తిరిగి వెళ్లలేక ఈ గేటు ద్వారా వెళ్లాలని వస్తే గంటల తరబడి నిరీక్షించాల్సిన సందర్భాలు కోకొల్లలు జరిగాయి. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని అండర్ పాస్ ఏర్పాటుపై ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులు సంకల్పించారు. దీనికి సంబంధించి తాజాగా ఉప్పరపాలెం గేటు వద్ద పరిశీలన జరిపారు. పట్టణ జనాభా లక్షకు దాటింది. ప్రజలకు పెద్ద సమస్యగా మారిన ఉప్పరపాలెం గేటు వద్ద అండర్ పాస్ ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయం అమలు జరిగితే వేలాది మంది ప్రజలకు వెసులుబాటు కలుగుతుంది. త్వరలోనే దీని అమలుకు అధికారులు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.


రైల్వేగేట్ వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

'రోటరీ'లో స్నేహితుల దినోత్సవం

ప్రజాశక్తి - బాపట్ల

స్నేహితుల దినోత్సవాన్ని రోటరీ కల్యాణ మండపంలో రోటరీ ప్రతినిధులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ కార్యదర్శి వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ స్నేహితుల రోజు అంటే కుల, మతాలకు అతీతంగా, ధనిక, పేద తారతమ్యం లేని రక్త సంబంధీకులు కంటే ఎక్కువగా ప్రేమించే వారే స్నేహితులని అన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని రోటరీలో నిర్వహించడం మంచి పరిణాం అని అన్నారు. కార్యక్రమంలో రోటరీ సీనియర్ సభ్యులు ఇ హరిబాబు, బూర్లె రామసుబ్బారావు, జిట్టా శ్రీనివాసరావు, తోట కృష్ణ, బొమ్మిశెట్టి శివరామకృష్ణ, కొత్త ఆంజనేయ వరప్రసాద్, యర్రా నాగేశ్వరరావు, రావూరి వీరరాఘవయ్య, జాగర్లమూడి లక్ష్మి, తాళ్లూరి మల్లికార్జునరావు పాల్గొన్నారు.


స్నేహితుల దినోత్సవంలో రోటరీ సభ్యులు


సంతమాగులూరు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - సంతమాగులూరు


విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథ పాలకులు బాదం విజయభాస్కరరెడ్డి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు.


వెంకటేశ్వరమ్మకి నివాళి అర్పిస్తున్న హరనాథ్ బాబు

హారిస్‌పేట సర్పంచికి సతీవియోగం

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని హారీస్‌పేట సర్పంచ్ చిప్పల వెంకటేశ్వరరావు సతీమణి చిప్పల వెంకటేశ్వరమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, హరనాథ్ బాబు సర్పంచి ఇంటికి వెళ్లారు. ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. ఆమె భర్త, సర్పంచ్ వెంకటేశ్వరరావును ఓదార్చి విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపిపి వెంట ఎంపీటీసీ నాజర్ ఖాన్, వైసీపీ నాయకులు కెవిఆర్, బూత్ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వరరావు, చిరంజీవి మాస్టారు, సైకం సూర్యచంద్రరావు, కొక్కిలిగడ్డ రాజేష్, ధనుంజయరావు ఉన్నారు.


రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ అబ్దుల్ రజాక్

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - బాపట్ల

రౌడీషీటర్లు అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ అబ్దుల్ రజాక్ హెచ్చరించారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పట్టణంలోని రౌడీషీటర్లకు స్టేషన్ ఆవరణలో ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్ల వివరాలు అడిగి తెలుసుకొని నమోదు చేసుకున్నారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవన విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - బట్టిప్రోలు

స్థానిక విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని పల్లెకోన ఫీడర్ పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం 8నుండి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఈ ఏడుకొండలు తెలిపారు. విద్యుత్తు మరమ్మత్తుల కారణంగా వేమవరం, సూరేపల్లి, తాతావారిపాలెం, కోనేటిపురం, పల్లెకోన, రాచూరు, ఆళ్ళమూడి గ్రామాలతో పాటు పెసర్లంక ఫీడర్ కింద ఉన్న పెదలంక, పెసర్లంక గ్రామాల్లో కూడా ఉదయం 8నుండి మధ్యాహ్నం 11వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కోవిడ్ నష్ట నివారణ పథకాలపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశంలో కోవిడ్‌తో సంభవించిన ఆర్థిక నష్ట పునరుద్ధరణకు కేంద్రం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భార్ భారత్ అభియాన్ పథక విజయాలు, కీలక పరిశ్రమల స్వావలంబనకు భవిష్యత్ ప్రణాళికలపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి, పంకజ్ చౌదరి సమాధానమిస్తూ దేశంలో కోవిడ్ తో సంభవించిన నష్ట నివారణకు ఆత్మనిర్భార్ భారత్ అభియాన్ పథకంలో 3 ప్యాకేజీలను 2020 మే, అక్టోబర్, నవంబర్ నెలలలో కేంద్రం ప్రకటించిందన్నారు. వీటితో పలు రంగాల స్వావలంబనకు - ఆర్థిక వద్ధికి తోడ్పాటు అందించబడుతుందన్నారు. ఈ పథక ప్యాకేజీలతో సాధించిన కొన్ని ముఖ్య విజయాలు ఉన్నాయని, వ్యాపారులకు ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ పథకంలో రూ.3.68 కోట్లు, లోటును అధిగమించుటకు బ్యాంకులు కాని ఆర్థికసంస్థలకు, హౌసింగ్, మైక్రో ఆర్థిక సంస్థలకు రూ.7,227 కోట్లు అందజేశామన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు బాండ్లు కొనుగోలు క్రెడిట్ లైన్ గ్యారంటీ పథకంలో రూ,.22,217 కోట్లు, ఉత్పత్తి పెంపుకు ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకంలో 14 రంగాలకు రూ.1.97 లక్షల కోట్లు, సామాజిక మౌలికసదుపాయాల వద్ధికి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్పుకు రూ.8,100 కోట్లు అందజేశామన్నారు. ప్రాజెక్టు ఎగుమతులకు ఐడిఈఏ పథకంలో ఎక్జిమ్ బ్యాంకుకు రూ.3 వేల కోట్లు, 50 సంవత్సరాల వడ్డీ లేని అప్పు పథకంలో 27 రాష్ట్రాలకు మూలధన వ్యయం పెంపునకు రూ.12 వేల కోట్లు, కిసాన్ క్రెడిట్ కార్డు పథకంలో 1.59 లక్షల మంది రైతులకు రాయితీ మరియు అత్యవసర అప్పులకు రూ.1.35 కోట్లు ఇచ్చామన్నారు. సహకార సంస్థలు రూ.45,852 కోట్లు, 2 శాతం వడ్డీ శిశు ముద్ర అప్పులలో రూ.637 కోట్లు, 64 మంది వీధి వర్తకులకు రూ.11,741 కోట్లు, గహనిర్మాణ రంగానికి రూ.8,868 కోట్లు అందజేశామన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యకమంలో రూ.13,343 కోట్లు, రాష్ట్రాల రుణ పరిమితి పెంపుకు రూ.3.2 లక్షల కోట్లు, ప్రావిడెంట్ ఫండ్ ఆర్థికభారం తగ్గుటకు కంపెనీ యజమానులకు రూ.10,188 కోట్లు ఇచ్చామన్నారు. పన్ను చెల్లించే కంపెనీలకు పన్నులు తగ్గింపు - గడువులు పెంపుదల, మంజూరుతో పాటు 8 కోట్ల వలసదారులకు 8 లక్షల టన్నుల ఆహారధాన్యాలు కేటాయింపు, 36 రాష్ట్రాలలో బి.పి.యల్. రేషన్ కార్డుల లో ఒక్కో వ్యక్తికి 5 కేజీల ఉచిత ఆహార ధాన్యాలు కొనసాగింపు వంటి కార్యక్రమాలతో నష్ట నివారణ జరిగిందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

పోలీసుల ఆరోగ్య సంక్షేమమే ధ్యేయం

- ఎస్పీ ఏఆర్ దామోదర్ - ఉపాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజా క్షేత్రంలో నిత్యం ప్రజాసేవకే అంకితమై అహర్నిశలూ విధులు నిర్వహిస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ మరియు వివిధ పోలీస్ స్టేషన్ లలో పోలీసు సిబ్బంది ఆరోగ్య రక్షణే లక్ష్యమని ఎస్‌పి ఏఆర్ దామోదర్ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ కళ్యాణ మండపంలో ఉపాస్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ క్యాంపులో ఎముకలు, ఊపిరితిత్తులు, జీర్ణాశయ, గుండె జబ్బులు మరియు జనరల్ మెడిసిన్ సంబంధించి హాస్పిటల్‌కు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్లచే సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో నిమగ్నమై ఉండి వారి ఆరోగ్య ప్రాధాన్యత కంటే ప్రజా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే పోలీసు సిబ్బంది యొక్క ఆరోగ్య సమస్యలను ముందస్తుగా కనుగొని వాటికి తగిన వైద్య చర్యలు తీసుకొనుటకు ఈ క్యాంపు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పోలీసు విధులు చాలా కష్టంతో కూడుకున్నవని, విధి నిర్వహణలో ఎండనక, వాననక, రేయనక, పగలనక పనిచేయాల్సి ఉండటమే కాక సరైన సమయంలో ఆహారం తీసుకోకపోవడం, కుటుంబానికి దూరంగా ఉండటం, ఒత్తిడి వలన కూడా పోలీసులు



మాట్లాడుతున్న ఎస్‌పి దామోదర్

అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలని, స్వల్ప అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యుల్ని సంప్రదించి చికిత్స పొంది ఆరోగ్య సమస్యలను తగ్గించుకోవాలని ఎస్పీ సూచించారు.



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ ఉమాపతిచౌదరి

మెడికల్ క్యాంపు లో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కు చెందిన డాక్టర్లు ఉమాపతిచౌదరి, కె.అనిల్, యు.శ్రీనివాసులు, సిహెచ్.శ్రీధర్, జి.శ్రీనివాస్, మరియు పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి, సిబ్బందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఆరోగ్యపరమైన అంశాలలో పోలీస్ సిబ్బందికి డాక్టర్లు సలహాలు, సూచనలను తెలియజేశారు. ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే తగిన ముందు జాగ్రత్తలను తీసుకోవాలని వైద్యులు సూచించారు.

కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీ చంద్ర శేఖర్, ఎస్ బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ భీమానాయక్, ఆర్ఐలు సీతా రామిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

స్కిల్స్ హబ్ ద్వారా ఉపాధి అవకాశాలు

- యువత నైపుణ్యాల అభివృద్ధే ధ్యేయం
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన
- త్వరలో స్కిల్ సెన్సెస్ నిర్వహణ
- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ



ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో యువతీ, యువకులలో నైపుణ్యాలను అభివృద్ధి చేయటమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ తెలిపారు. స్కిల్ హబ్స్, స్కిల్ కళాశాల ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో యువత విద్యార్హతలు, నైపుణ్యాలు, ఇతర అంశాలపై త్వరలో స్కిల్ సెన్సెస్ నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా యువతీ, యువకులకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను డిఎస్‌డిఒ 'ప్రజాశక్తి'కి వివరించారు.

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్రణాళిక ప్రకారం యువతీయువకులకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. గతంలో యువత సర్వేకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలు అందించాం. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావటం, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి సారించటం అందుకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలు అమలు చేస్తున్నాం.

మెగా, మినీ జాబ్ మేళాల నిర్వహణ

జిల్లాలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో నెలలో ఒక మెగా, ఓ మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నాం. ఆ నియోజకవర్గంలో ప్రజాప్రతినిధుల సహకారంతో జాబ్‌మేళాను చేపడుతున్నాం. మెగా, మినీ జాబ్ మేళాకు వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు వస్తున్నాయి. అర్హులైన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. గత ఏడాది 22 జాబ్ మేళాలు నిర్వహించి 1532 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాం.

స్కిల్ హబ్స్‌లో యువతకు శిక్షణ

జిల్లాలో 10 స్కిల్ హబ్స్ ఉన్నాయి. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక స్కిల్ హబ్ ఉండగా, జిల్లా కేంద్రమైన ఒంగోలులో 3 స్కిల్ హబ్స్ ఉన్నాయి. ప్రభుత్వ భవనాలోని ఐటిఐ, పాలిటెక్నిక్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో యువత అభిరుచులకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలు అందిస్తున్నాం. స్కిల్ హబ్స్‌లో ల్యాప్ ట్యాప్స్, ట్యాబ్స్, ఎల్‌ఇడి టివిలు, ఫర్నీచర్ ఏర్పాటు చేశాం. 1354 మందికి శిక్షణ ఇచ్చి 70 శాతం మందికి ఉపాధి కల్పించాం. ఒంగోలు టిటిడిసిలో స్కిల్ కళాశాల ఏర్పాటు చేసి యువతీ, యువకులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇస్తున్నాం. ఇక్కడ కూడా ల్యాప్ ట్యాప్స్, ట్యాబ్స్, ఎల్ఇడి టివిలు, ఫర్నీచర్ ఏర్పాటు చేశాం.

డిగ్రీ విద్యార్థులకు స్కిల్స్ ట్రైనింగ్స్

జిల్లాలో డిగ్రీ కళాశాలల్లో 25 ఈఎస్‌సి కేంద్రాలు ఉన్నాయి. విద్యార్థులకు ట్యాలీ, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, వంటి కోర్సులపై ఆన్‌లైన్, ఆఫ్ లైన్‌లో శిక్షణ ఇస్తున్నాం. కంప్యూటర్ ఫండమెటల్స్‌తో పాటు ఎంఎస్ ఆఫీస్. అమెజాన్ వెబ్ సర్వీసెస్‌లో శిక్షణ ఇస్తున్నాం. గత ఏడాది 2240 మందికి వివిధ కోర్సులలో శిక్షణ ఇచ్చాం. వెబ్ డెవలప్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌పై త్వరలో శిక్షణ ఇవ్వనున్నాం.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన

వ్యాపార రంగాన్ని ఏవిధంగా నడపాలనే విషయమై జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నాం. వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలి(స్టార్ట్ యువర్ బిజినెస్), వ్యాపారాన్ని ఎలా నిర్వహించాలి(జనరేట్ యువర్ బిజినెస్) అనే అంశాలపై అవగాహన సదస్సులు జరపనున్నాం.

త్వరలో స్కిల్ సెన్సెస్ నిర్వహణ

రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్కిల్ సెన్సెస్ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి జీవో ఎంఎస్ నెంబర్ 13ను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రపంచంలో, దేశంలో మొదటిసారి ఆంధ్రప్రదేశ్ స్కిల్ సెన్సెస్ చేపట్టడం గమనార్హం. గృహాన్ని యూనిట్‌గా తీసుకొని 15 నుంచి 59 సంవత్సరాల లోపు వారిని స్కిల్ సెన్సెస్ నిర్వహిస్తాం. నిరుద్యోగుల విద్యార్హతలు, ఏ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు, ఆదాయ వనరులు ఏమిటి, భవిష్యత్తులో వారి పిల్లలకు ఎలాంటి ఉద్యోగాలు అవసరమనే సమాచారాన్ని సేకరిస్తాం. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి 1-2 నెలల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. రానున్న రోజుల్లో అన్ని శాఖల సహకారంతో జిల్లాలో నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తా..

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన

ఆ చట్టాలను నిలిపేయాలి..

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని, లేని పక్షంలో చట్టాలలో సవరణ చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ ఒంగోలు అద్దంకి బస్టాండ్ మిత్రా స్టాండ్ యూనియన్ మహాసభ ఆదివారం బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలకు అనుగునంగా రాష్ట్ర ప్రభుత్వం జీఓనెంబర్ 21ని తీసుకు వచ్చిందన్నారు. ఈజీఓ రవాణా కార్మికుల మెడమీద కత్తిలా పనిచేస్తుందన్నారు. ఆల్ ఇండియా



మాట్లాడుతున్న శ్రీనివాసులు

రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఒంగోలు నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు ఆటోలు ఉన్న ప్రతి చోట ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక..

మహాసభ సందర్భంగా 17 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పి.తిరుమలయ్య, శేఖర్, కోశాధికారిగా కొండయ్య, సభ్యులుగా కొండారెడ్డి, ఆనంద్, రామిరెడ్డి, మరికొంతమందిని ఆఫీసు బేరర్లుగా ఎన్నుకున్నారు.

